



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

విలీనంతో వినాశనం..!

ప్రభుత్వ బడులకు శాపంగా జగన్ నిర్ణయాలు

విద్యావ్యవస్థలో నాటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలు గ్రామీణ విద్యార్థుల పాలిట శాపంగా మారాయి. 117 జీవో ద్వారా ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం ద్వారా నేడు వినాశనానికి దారితీస్తోంది. 3,4,5 తరగతుల పిల్లలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం, 1,2 తరగతులకు సరిపడా పిల్లలు లేకపోవడం.. వెరసి జిల్లా వ్యాప్తంగా 271 పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది.



కొత్తచెరువు మండలం ఓబులదేవరపల్లిలో మూతపడిన పాఠశాల

117 జీవోతో మూత దశగా 271 పాఠశాలలు

ఏటేటా తగ్గుతున్న విద్యార్థుల చేరిక

కొత్తచెరువు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలతో నేడు ప్రాథమిక విద్య గ్రామీణ విద్యార్థులకు అందని ద్రాక్షగా మారింది. నాటి సీఎం జగన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో నేడు ప్రభుత్వ బడుల మూతకు దారితీస్తున్నాయి. పెత్తందార్లకు, పేదలకు మధ్య యుద్ధమని.. తాను పేదల పక్షమని చెప్పుకున్న జగన్‌రెడ్డి గ్రామాల్లో పేదలకు బడులను దూరం చేశారని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. జగన్ తెచ్చిన 117 జీవో ప్రభావంతో సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 271 ప్రభుత్వ బడులు మూతపడేదశకు చేరుకుంటున్నాయని విద్యాశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. జిల్లాలో అమడగూరు, తలుపుల మండలాల్లో ప్రభుత్వ బడులు ఎక్కువగా మూతపడే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన పాఠశాల భవనాలు నిరుపయోగంగా మారనున్నాయి.

117 జీవోతో ప్రైవేటు బాటలో విద్యార్థులు

గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలతో పిల్లలు కనీస విద్యకు నోచుకునేవారు. అలాంటి ప్రభుత్వ పాఠశాలలు 117 జీవోతో నేడు మూతపడే స్థాయికి చేరుకుంటున్నాయి. ఆ జీవో ప్రకారం గత ప్రభుత్వం జిల్లాలోని 130 గ్రామీణ పాఠశాలల్లోని 3,4,5 తరగతులను మూడు కిలో మీటర్ల పరిధిలోని హైస్కూళ్లలోకి విలీనం చేసింది. దీనివల్ల గ్రామీణ పాఠశాలల్లో 1,2 తరగతులు చదివే పిల్లలు ముగ్గురి నుంచి 10 మందిలోపు మాత్రమే మిగిలారు. రెండు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు ఉండడం, పైతరగతులు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపేందుకు సుముఖత చూపడంలేదు. ఈ నేపథ్యంలో పల్లెలకు సైతం ప్రైవేటు పాఠశాలల బస్సు సౌకర్యం ఉండడంతో చాలామంది ప్రైవేటు బాట పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య 2023-24లో 1,60,711 మందికి గాను 2024-25లో 1,54,883 మంది అంటే 5,823 విద్యార్థులు తగ్గినట్లు విద్యాశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. దీనిని బట్టి ప్రతి ఏటా ప్రభుత్వ బడుల్లో 5 నుంచి 8 వేల మంది విద్యార్థులు తగ్గుతున్నారు. కొత్తచెరువు మండలంలో ఓబులదేవరపల్లి, కె.వెంకటాపురం, బైరాపురం గ్రామాల్లోని పాఠశాలలు గత ప్రభుత్వంలో మూతపడ్డాయి. జిల్లా వ్యాప్తంగా ఇలా 15 గ్రామీణ పాఠశాలలు విద్యార్థులు లేక మూతబడ్డాయి.



271 పాఠశాలలు ఖాళీ కానున్నాయా..?

కొత్తచెరువు మండలంలో ఐదుగురిలోపు పిల్లలు ఉన్న పాఠశాలలు ఐదు ఉన్నాయి. వీటిలో బండ్లపల్లి, నారాయణపురం, చెన్నమరాజుపల్లి, తిరుములదేవరపల్లి, వంగంపల్లి ఉండగా, 10 లోపు పిల్లలు ఉన్న బడులు 13 ఉన్నాయి. ఇదే విధంగా ప్రస్తుతం జిల్లాలో ఐదుగురిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 75 ఉండగా, 10 మందిలోపు ఉన్న పాఠశాలలు 196 ఉన్నాయని విద్యాశాఖ లెక్కల ద్వారా తెలుస్తోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే 271 పాఠశాలలు ఖాళీ అయ్యే అవకాశాలు లేకపోలేదు.

పేదలకు విద్య దూరం: బాబావలి, ఎస్ఎఫ్ఐ



గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోతో గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలు చాలా వరకు మూతపడ్డాయి. దీంతో పేద పిల్లలకు విద్య దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. ప్రైవేటు పాఠశాలలు అధికమయ్యాయి. కాలక్రమేణా ప్రభుత్వ పాఠశాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వ బడులు ఎక్కడ ఉన్నాయో వెతుక్కొనే పరిస్థితులు రానున్నాయి.

ఉద్యోగుల పిల్లలు ప్రభుత్వ బడుల్లోనే చదవాలి



ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ప్రభుత్వ పాఠశాల్లో చదివే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం చేయాలి. ప్రభుత్వ ఉపాధ్యాయులు పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివించడం కూడా ప్రభుత్వ బడులపై ప్రభావం చూపుతోంది. తల్లిదీవెన పథకం ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలకు మాత్రమే వర్తింపజేయాలి.

- ఇంతియాజ్, జిల్లా కార్యదర్శి, సీపీఎం

ఎల్‌కేజీ, యూకేజీ అమలు చేయాలి..



ప్రభుత్వ బడుల్లో ఎల్‌కేజీ, యూకేజీతో పాటు ఇంగ్లీషు, తెలుగు మీడియం అమలు చేయాలి. 117 జీవోను రద్దుచేసి యథావిధిగా గ్రామాల్లో 1 నుంచి 5 వరకు ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలి. ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా చూడాలి. అప్పుడే ప్రభుత్వ బడులకు పూర్వవైభవం వస్తుంది.

ఆర్.చంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీటీఎఫ్

సోలార్ హబ్‌గా మడకశిర

- 16 వేల ఎకరాల సేకరణ: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర రూరల్/గుడిబండ, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గం సోలార్ హబ్‌గా మారనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. శనివారం మండలంలోని బుళ్లసముద్రం గ్రామ సమీపంలో సోలారు పార్కు ఏర్పాటుకు భూములను పరిశీలించారు. అక్కడే రైతులతో చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మడకశిర మండలం బుళ్లసముద్రం, మణూరు, కల్లుమర్రి హరేసముద్రం పంచాయతీల పరిధిలో 10 వేల ఎకరాల్లో సోలార్ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా గుడిబండ మండలంలో 6వేల ఎకరాలను సేకరించి సోలార్ హబ్ ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు సంవత్సరానికి ఎకరాకు రూ.31 వేలు పరిహారం ఇస్తారని తెలిపారు. రైతుల నుంచి ఇష్టపూర్వకంగానే భూములను సేకరిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల రైతుల జీవన ప్రమాణాలు పెరుగుతాయని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పంటలు సాగుచేయలేక నిరుపయోగాంగా ఉన్న భూములు సోలార్ పార్కు ఏర్పాటుతో రైతులకు ఆదాయం వస్తుందన్నారు. భవిష్యత్‌లో మడకశిర సోలార్ హబ్‌గా మారనున్నట్లు తెలిపారు. గుడిబండ మండలంలోని జమ్ములబండ గ్రామ సమీపంలో ఉన్న రైతుల భూములను ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో గుడిబండ తహసీల్దార్ కరుణాకర్, సోలార్ ప్రాజెక్ట్ ఇంజనీర్ శివశంకర్, టీడీపీ నాయకులు శ్రీనివాసమూర్తి, కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, మద్దనకుంటప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో అఖండ భజన

పుట్టపర్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతు సభా మండపంలో శనివారం సాయంత్రం 6గంటలకు గ్లోబల్ అఖండ భజన ప్రారంభమైంది. సత్యసాయి విద్యార్థుల వేదపఠనంతో అఖండ భజన ప్రారంభించారు. 24 గంటల పాటు నిరంతరాయంగా కొనసాగి ఆదివారం సాయంత్రం 6 గంటలకు మంగళహారతితో ముగిస్తారు. ప్రతిఏడాది సత్యసాయి జయంతి వేడుకల సందర్భంగా నవంబరు 9న అఖండ భజన చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. వేలాది మంది భక్తులు అఖండ భజనలో పాల్గొన్నారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయికుల్వంతు మందిరంలో ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేశారు.



పాటలు పాడుతున్న విద్యార్థులు



హిందూపురంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో వీడియో చిత్రీకరిస్తున్న డ్రోన్

డ్రోన్లతో నిఘా..!

శాంతి భద్రతలపై డేగ కన్ను

అనుమానాస్పద స్థలాల్లో సమాచార సేకరణ

పేకాట కేంద్రాల గుర్తింపునకు సైతం..

రాత్రిపూట పర్యవేక్షణ



డ్రోన్‌ను పరిశీలిస్తున్న సీఐ ఆంజనేయులు

హిందూపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు నేరాల నియంత్రణకు పోలీసులు లాఠీ వాడేవారు. ఆ తరువాత పెన్ కెమెరాలో నేరస్థులు, సంఘటనలను రికార్డ్ చేసేవారు. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ ద్వారానే కొన్ని నేరాల గుర్తిస్తున్నారు. పెరిగిన టెక్నాలజీతో నేరాల నియంత్రణ, భద్రత, ప్రమాదాల నివారణకు ఇకమీదట డ్రోన్‌ను వినియోగంలోకి తెస్తున్నారు. పోలీసులు వెళ్లలేని చోటుకు డ్రోన్‌ను పంపి అందులోని కెమెరాల ద్వారా నిఘాపెట్టి పర్యవేక్షించి చర్యలు చేపట్టనున్నారు. ఇటీవల విశాఖ పట్నంలో డ్రోన్ల ఎగ్జిబిషన్ సందర్భంగా నేరాల నియంత్రణకు వీటిని వినియోగిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు వెల్లడించారు. అందుకు అనుగుణంగా ప్రయోగాత్మకంగా వాటి పనితీరుపై పరిశీలన మొదలు పెట్టారు.

శాంతి భద్రతలపై డేగ కన్ను

చాలీచాలని సిబ్బంది, పెరుగుతున్న నేరాలు, శాంతిభద్రతల కట్టడి పోలీసులకు పెను సవాల్‌గా మారుతున్న నేపథ్యంలో డ్రోన్ల వినియోగంతో సెక్యూరిటీ వ్యవస్థను మెరుగు పరచడానికి పోలీస్‌శాఖ సన్నద్ధమవుతోంది. ముఖ్యమంత్రి ఆలోచనకు అనుగుణంగా జిల్లాలో కూడా పోలీస్ శాఖ చర్యలు చేపడుతోంది. ఇప్పటికే జిల్లాలో నాలుగు డ్రోన్లు ఉండగా ఇందులో రెండు హిందూపురంలో వినియోగించడానికి కేటాయించారు. భవిష్యత్తులో మరిన్ని డ్రోన్లు పోలీస్‌శాఖకు ఇవ్వనున్నారు. ముఖ్యంగా పట్టణాల్లో జరిగే ధర్నాలు, ర్యాలీలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్ వినియోగం ఎంతగానో ఉపయోగపడుతుంది. వాహనాల వేగం, అధిక లోడులను కూడా గుర్తించేందుకు పరిశీలిస్తున్నారు. వీవీఐపీల పర్యటన సందర్భంగా వారి భద్రతా పరంగా ప్రత్యేకంగా నిఘా ఉంచడానికి డ్రోన్ వినియోగిస్తే ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

అనుమానాస్పద స్థలాలపై నిఘా

ముఖ్యంగా జిల్లాలోని పట్టణాల్లో నేరస్థులు నివాసముండే అనుమానాస్పద స్థలాలు, లేదా షెల్టర్ జోన్లను గుర్తించడానికి డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడతాయి. వారున్న ప్రాంతాలకు పోలీసులు వెళ్తే తప్పించుకోవడానికి అవకాశం ఉంటుంది. డ్రోన్ 200 నుంచి 300 మీటర్ల ఎత్తులో ఎగురుతూ వీడియో, ఫొటోలు చిత్రీకరిస్తుంది. దాదాపు 3 కిలో మీటర్ల దూరం నుంచి దీనిని ఆపరేట్ చేయవచ్చు. భవిష్యత్తులో 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న వాటిని గుర్తించే డ్రోన్లు కూడా రానున్నాయి. ఇవి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే పోలీసులకు ఎంతో ఉపయోగపడతాయి. ఇప్పటికే జిల్లాలో నాలుగు డ్రోన్లు పోలీస్‌శాఖకు అందాయి. ప్రతి సబ్‌డివిజన్‌కు 10 డ్రోన్లు కావాలని ఉన్నతాధికారులకు ఎస్పీ నివేదిక పంపారు. జిల్లాలో ఐదు సబ్‌డివిజన్లు ఉండగా 10 అందజేస్తే మండలానికి ఒకటి చొప్పున అందే అవకాశం ఉంటుంది.

రాత్రిపూట పర్యవేక్షణ

ఇప్పటి వరకు రాత్రిపూట పోలీసు గస్తీ తిరిగేటప్పుడు పై స్థాయి అధికారులు నేరుగా వెళ్లి పర్యవేక్షించేవారు. ఇకమీదట డీఎస్పీ లేదా సీఐలు ఒకేచోట కూర్చుని హిందూపురం పట్టణంలో మూడు డ్రోన్ల ద్వారా రాత్రిపూట గస్తీ పర్యవేక్షించవచ్చు. అర్ధరాత్రి దాకా రోడ్లపై జనం ఉంటే పసిగట్టవచ్చు. డ్రోన్లు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే రాత్రిపూట గస్తీ తప్పకుండా చేయాల్సిన పరిస్థితి వస్తుంది. మరీ ముఖ్యంగా అసాంఘిక శక్తుల కదలికలు, గంజాయి విక్రయాలు, వినియోగం, రవాణా, రౌడీలు, కేడీలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచడానికి అవకాశం ఉంది. శివారు ప్రాంతాల్లో చెట్లపొదల్లో పేకాట స్థావరాలను సునాయాసంగా గుర్తించవచ్చు. ఇప్పటికే హిందూపురంలో కొన్ని సమస్యాత్మక ప్రాంతాలను చిత్రీకరించారు.



ఎంతగానో ఉపయోగపడతాయి : రత్న, ఎస్పీ

అసాంఘిక శక్తుల ఆటకట్టించడానికి డ్రోన్లు వచ్చాయి. దీనిద్వారా పోలీస్ సిబ్బంది తక్కువగా ఉన్నా కొన్ని సందర్భాల్లో ఎంతగానో ఉపయోగపడతాయి. భవిష్యత్తులో పోలీస్‌శాఖకు, నేరాల నియంత్రణకు డ్రోన్లు దోహదపడనున్నాయి. జిల్లాలో ఐదు సబ్‌డివిన్లకు 50 డ్రోన్లు కావాలని నివేదిక పంపాం. అవి పూర్తి స్థాయిలో వస్తే నేరాలు తగ్గించవచ్చని భావిస్తున్నాం.

పుడా కొట్లాట..!

- చైర్మన్ గిరీపై ఉత్కంఠ
- రెండో జాబితాలోనూ దక్కని స్థానం
- ఆశావహుల్లో టెన్షన్





పుట్టపర్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల రెండో జాబితాలో పుడాకు చోటు లభించకపోవడంతో చైర్మన్ గిరి ఆశావహుల్లో ఉత్కంఠకు దారితీస్తోంది. కొన్నాళ్లుగా పుడా చైర్మన్ గిరి ఎవరిని వరిస్తుందో అన్న ఉత్కంఠ కూటమి నేతల్లో చర్చలకు దారితీస్తోంది. చైర్మన్ గిరి మాదేనంటూ ఎవరికి వారు చెప్పుకుంటున్నారు. శనివారం కూటమి ప్రభుత్వం నామినేట్ పదవుల రెండో జాబితాలో పుడాకు చోటుదక్కపోవడంతో ఆశావాహుల్లో టెన్షన్ మొదలైంది. పుట్టపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే తరువాత అంతటి ప్రాధాన్యత కల్గిన పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ (పుడా) చైర్మన్ గిరి వైపు అధికార కూటమిలో అందరి కళ్లు దీనిపైనే పడ్డాయి. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంతోపాటు జిల్లా కేంద్రంగా పుడాకు ప్రాధాన్యత నెలకొంది. ప్రదానంగా పుట్టపర్తికి ప్రతి ఏటా దేశవిదేశాల నుంచి అతిథులు వస్తుంటారు. ప్రొటోకాల్ పదవి కావడంతోపాటు ఆర్థిక వనరులున్న పుడాపై పట్టు కోసం కూటమిలో టీడీపీ నేతల్లో కొందరు తమకు అవకాశం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలోనే చైర్మన్ గిరి కోసం టీడీపీలో కొందరి నేతల మధ్య నువ్వానేనా అన్న విధంగా సాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా రెండో జాబితాలో పలు అర్బన్ డెవలప్‌మెంట్‌లకు చైర్మన్లను ప్రకటించినా పుడాకు చోటు దక్కకపోవడం చూస్తే అధికార కూటమిలో ఆ పదవి కోసం కోట్లాట మొదలైనట్లు తెలుస్తోంది.

చైర్మన్ గిరి కోసం పోటాపోటీ

పుడా చైర్మన్ పదవి కోసం పుట్టపర్తిలో పలువురు నేతల మధ్య కోట్లాట మొదలైంది. ఇందులో పుట్టపర్తి అర్బన్ టీడీపీ కన్వీనర్ రామాంజనేయులు, పుట్టపర్తికి చెందిన రామ్‌లక్ష్మణ్ సోదరుల్లో లక్ష్మీపతి, తెలుగుయువత నాయకుడు ఊరివాకిల సురేష్‌నాయుడు చైర్మన్ గిరిని ఆశిస్తున్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డితోపాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆశీస్సుల కోసం ఎవరికి వారుగా పోటీపడి పైరవీలు చేసుకుంటున్నారు. తమకే ఇవ్వాలంటూ పుట్టపర్తి ఎమ్మెల్యేతోపాటు టీడీపీ అధిష్ఠానం పెద్దలను పట్టుపడుతూ పంచాయతీ పెట్టారు. పలుమార్లు అమరావతికి వెళ్లి సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్‌ను కలిసి వచ్చారు. ఈ నేపథ్యంలో చైర్మన్ స్థానం కోసం ముగ్గురు మధ్య నువ్వా నేనా అన్నట్లుగా పోటీ పడుతూ తమకు అవకాశం కల్పించాలంటూ ప్రయత్నాలు మొదలు పెట్టారు. అధిష్ఠానం మాత్రం పార్టీలో కష్టపడి పనిచేసిన వారికే అవకాశం ఇవ్వాలని పలు సర్వేలు చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. మూడో జాబితాలోనైనా పుడా చైర్మన్ ఎవరన్నది ఉత్కంఠ తెరదించుతారా అన్న చర్చ జరుగుతోంది.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురు

కొత్తచెరువు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు శ్రీసత్యసాయి జిల్లా నుంచి నలుగురు ఎంపికయ్యారు. టి.విజయ్‌కుమార్ (ప్రిన్సిపల్, ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్, గోరంట్ల), షేక్ మహమ్మద్ యాసిన్ (స్కూల్ అసిస్టెంట్, హిందీ, జడ్పీ పాఠశాల రెడ్డిపల్లి, నల్లమాడ మండలం), టి.చెన్నక్రిష్టారెడ్డి (స్కూల్ అసిస్టెంట్ , సోషియల్, జడ్పీ పాఠశాల కేశాపురం, కొత్తచెరువు మండలం), ఎ.శిరీష (ట్రై గ్రాడ్యుయేట్ గణితం, మోడల్ పాఠశాల, ధర్మవరం) అవార్డులకు ఎంపికయ్యారు. ఈ అవార్డులను సెప్టెంబరు 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా అందించాల్సి ఉంది. విజయవాడలో వరదలు కారణంగా వాయిదా పడ్డాయి. దీంతో ఈనెల 11న డాక్టర్ మౌలానా అబుల్‌కలాం జయంతి సందర్భంగా ఈ అవార్డులను అందజేస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప తెలిపారు. మైనార్టీ వెల్ఫేర్‌శాఖ ద్వారా ఐదుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. వీరిలో.. ఫైరోజ్ అహమ్మద్ (ఉర్దూపాఠశాల, గోరంట్ల), నఫీస్ సుల్తానా(హిందూపురం, ఉర్దూ పాఠశాల హెచ్ఎం), అబ్దుల్ వాజీద్ (మండల పరిషత్ ఉర్దూపాఠశాల, గాండ్లపెంట), ఫాజిల్ కరీం (గణిత ఉపాధ్యాయుడు, ఉర్దూ పాఠశాల, పెనుకొండ), వహిదా (ధర్మవరం ఉర్దూ పాఠశాల) ఉన్నారు. వీరికి సత్యసాయి జిల్లా కేంద్రంలోని సాయిఆరామంలో అవార్డులు అందజేస్తామన్నారు. ఉర్దూమీడియంలో 10వ తరగతి టాపర్ల వివరాల వెల్లడించారు. సానియా కుబ్రా (హిందూపురం), షేక్ సాదియా (కదిరి), నూరే కౌమషైన్ (పరిగి) వీరు ఉత్తమ విద్యార్థులుగా ఎంపికయ్యారని ఆయన తెలిపారు. వీరికి జిల్లా కేంద్రంలోని సాయిఆరామంలో ఉత్తమ విద్యార్థుల అవార్డులను అందజేస్తామని తెలిపారు.

బావిలో గల్లంతైన కూలీ మృతి

24 గంటలు శ్రమించిన అధికార యంత్రాంగం
మృతదేహం వెలికితీత

7



మృతిచెందిన రామాంజనేయులు (ఫైల్)


నేరస్థుల ఆట కట్టిస్తాం..

‘పురం’ ప్రక్షాళనే ధ్యేయం

తప్పు దొరికితే అధికారులను కూడా ఉపేక్షించం

త్వరలో 3వేల కెమెరాలతో నిఘా: ఎస్పీ రత్న

హిందూపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నేరస్థుల ఆటకట్టిస్తామని జిల్లా ఎస్పీ రత్న అన్నారు. శనివారం హిందూపురానికి విచ్చేసిన జిల్లా ఎస్పీ పట్టణంలోని బైపాస్ రోడ్డులోపోలీస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంకు ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా డీఎస్పీ కార్యాలయానికి సంబంధించి భవనాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హిందూపురం ప్రక్షాళన చేస్తామన్నారు. కొంతమంది నేరస్థులు ఏళ్లతరబడి ఇక్కడే ఉండి వారు వివిధ ప్రాంతాల్లో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వారిని వదిలిపెట్టే ప్రసక్తేలేదన్నారు. ఎవరైనా మహిళలపట్ల చూడాలన్నా, అసభ్యకరంగా మాట్లాడాలన్నా భయపడే విధంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరూ సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలతో పోస్టు చేయరాదని తెలిపారు. జిల్లాలో అతిపెద్ద పట్టణం హిందూపురం కావడంతో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి అన్నివిధాలా పరిశీలిస్తున్నామని అన్నారు. ప్రజల సహకారంతో పట్టణంలో రోడ్ల విస్తరణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు తోడ్పాటునందించాలన్నారు. త్వరలో మూడు వేల కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. పోలీస్‌శాఖకు సంబంధించి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని వివరించారు. చిలమత్తూరు మండలంలో జరిగిన సామూహిక అత్యాచారం సంఘటనను దృష్టిలో పెట్టుకుని పట్టణంలో గంజాయి రవాణా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గ్యాంగ్ రేప్ సంఘటనను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ విచారణ చేశామన్నారు. డీఎన్‌ఏ రిపోర్ట్ రావాల్సి ఉందన్నారు. శాంతి భద్రతల విషయంలో సిబ్బంది తప్పుచేస్తే ఉపేక్షించే ప్రసక్తేలేదన్నారు. ఇదే పరిస్థితుల్లో అలాంటి వాటిలో అధికారులు ప్రమేయం ఉంటే వదిలే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నామని ఇందుకు సంబంధించి సెట్ కంట్రోల్ రూమ్ హిందూపురంలో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. త్వరలోనే హిందూపురానికి కొత్త సిబ్బంది నియామకం ఉంటుందన్నారు. నేరస్థులకు సహకరించినవారు ఎవరైనా ఉంటే ఆధారాలతో చర్యలు తీసుకుంటామన్నారు. గుడ్డం ప్రాంతంలో పాత నేరస్థులు స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారని, ఆ ప్రాంతాల్లో జల్లెడ పడతామని తెలిపారు. త్వరలో హిందూపురం పట్టణంలో మరిన్ని మార్పులు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం పాల్గొన్నారు.



అవినాశ్ నిర్వహిస్తున్న హోటల్

చికిత్సలు చేయించడానికి వృద్ధుడిని ఆసుపత్రికి తెచ్చిన అవినాశ్

గుంతకల్లు పట్టణంలో బజ్జీల దుకాణం నడిపే కే అవినాశ్ అనే యువకుడు ఇన్‌స్టాగ్రాంలో రీల్స్ ద్వారా దూసుకుపోతున్నాడు. తన రీల్స్ ద్వారా అతి తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు పొందాడు. నాలుగు నెలల్లోనే 22 వేల మంది ఫాలోయర్స్‌ను సమకూర్చుకున్నాడు. స్థానికంగా చానల్‌కు గుర్తింపు రావడంతో యాడ్ ప్రమోషన్స్ వెతుక్కుంటూ వచ్చాయి. స్థానిక వ్యాపారాలను తన ఇన్‌స్టాగ్రాం చానల్‌లో ప్రమోట్ చేస్తూ ఒక నిమిషం వీడియోకు రూ. వెయ్యి నుంచి రూ. 1,500ల వరకూ ఆదాయం పొందుతున్నాడు. ఇలా వచ్చిన డబ్బును స్నేహితులతో కలిసి సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నాడు. ఇతడి అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు కల్పించిన ఆటంకాలను అధిగమించి విజయవంతంగా ముందుకు దూసుకుపోతున్నాడు.

- ఆంధ్రజ్యోతి, గుంతకల్లు




హోటల్‌ను నిర్వహిస్తున్న అవినాశ్

ఇన్‌స్టాగ్రాంలో వీడియోలతో గుర్తింపు

ఇన్‌స్టాంట్ సెలబ్రిటీ..!

- రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్‌తో ఫేం
- పెరుగుతున్న యాడ్ ప్రమోషన్, రెవెన్యూ
- వచ్చిన డబ్బుతో సామాజిక సేవా కార్యక్రమాలు
- రియల్‌స్టార్‌గా మారిన గుంతకల్లు యువకుడు





ఇన్‌స్టాగ్రాంలో రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్ హోం పేజ్

స్థానిక ధర్మవరం గేటు పక్కన బజ్జీల షాపును నిర్వహిస్తున్న అవినాశ్ పదో తరగతి వరకు చదువుకున్నాడు. సినిమా థియేటర్లలోని క్యాంటీన్లలో పనిచేస్తూ నటన పట్ల ఆసక్తిని పెంచుకున్నాడు. 2018లోనే షార్ట్ ఫిలింస్ రూపొందించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం ప్రారంభించాడు. కానీ పెద్దగా ఆదరణ పొందలేదు. అయినా అడపాదడపా యూట్యూబ్‌లో రీల్స్ చేసేవాడు. ఈక్రమంలోనే ఈ సంవత్సరం జూలైలో ఇన్‌స్టాగ్రాంలో రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్‌ను

రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్‌తో..

ప్రారంభించి రీల్స్ చేయడం ప్రారంభించాడు. అతి తక్కువ కాలంలోనే ఫాలోయర్స్ భారీగా పెరిగారు. నాలుగు నెలల్లోనే 22 వేల పైచిలుకు ఫాలోయర్స్‌ను కూడగట్టుకున్నాడు. ఇతడు అప్‌లోడ్ చేసిన పలు వీడియోలు మిలియన్ వ్యూస్ దాటి ఆదరణ పొందాయి. ఏ వీడియో అప్‌లోడ్ చేసినా సగటున 40 వేల వ్యూస్ వస్తుండటంతో తమ షాపు, వ్యాపారాల ప్రమోషన్ చేయాలంటూ ఇతడికి అభ్యర్థనలు ప్రారంభమయ్యా యి. ప్రస్తుతం ప్రతి రోజూ కనీసం రెండు, మూడు యాడ్ ప్రమోషన్ చేస్తున్నాడు. నాలుగు నెలల్లోనే దాదాపు 400 యాడ్ ప్రమోషన్స్ చేశానని ఇతడు తెలియజేశాడు.

ఇన్‌స్టాగ్రాంలో చానల్ మోనిటైజేషన్‌కు దరఖాస్తు చేసుకోకమునుపే యాడ్ ప్రమోషన్ ద్వారా డబ్బు వస్తుండటంతో అవినాశ్ వృద్ధులు, అనాథలకు సేవా కార్యక్రమాలు ప్రారంభించాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యాచకుడికి గాయమై చాలా దుర్భర స్థితిలో రైల్వే ఏరియాలో పడి ఉండగా స్నేహితుల సాయంతో అనంతపురం తీసు

ఇన్‌స్టా ఆదాయంతో సేవా కార్యక్రమాలు

కెళ్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేయించాడు. మరలా గుంతకల్లుకు తెచ్చి ఇక్కడి ఆసుపత్రిలో రెండు, మూడు రోజులకోసారి డ్రెస్సింగ్ చేయిస్తున్నాడు. ఆ కార్యక్రమాలను కూడా రీల్స్‌గా చేయడంతో సామాజిక సేవా కార్యక్రమాలకు కొందరు సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా కూడా ఇతడికి ప్రజాదరణ లభించి, చానల్ వేగంగా వృద్ధిలోకి వచ్చింది.

చానల్ హ్యాక్

అతి తక్కువ కాలంలోనే చానల్ వృద్ధి చెందడం, ప్రజాదరణ పొందడాన్ని చూసి ఓర్వలేని కొందరు తన వీడియోలకు దుర్భాషలతో కామెంట్స్ పెట్టారని అవినాశ్ ఆవేదనను వ్యక్తంచేశాడు. కొందరు ఫాలోయర్స్ తనకు మద్దతుగా కామెంట్స్ పెడితే వారి కుటుంబ సభ్యులను కూడా తిడుతూ పోస్టులు పెట్టి వేధించారన్నాడు. నెలన్నర కిందట తన చానల్‌ను హ్యాక్‌చేసి దాదాపు 70 వీడియోలను డిలీట్ చేశారన్నాడు. చానల్‌లో 20 రోజుల పాటు తాను వీడియోలను అప్‌లోడ్ చేయలేకపోయానని అవినాశ్ తెలిపాడు. తన చానల్ హ్యాక్ అయ్యిందని తెలుసుకున్న ఓ టెకీ అయిన ఫాలోయర్ గుంతకల్లుకు వచ్చి, తన చానల్‌ను రికవరీ చేసి ఇచ్చాడన్నాడు. దుర్భాషలాడుతున్న వ్యక్తులు స్థానికులని తెలిసి పోలీసులకు ఫిర్యాదుచేస్తే వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారని వెల్లడించారు. తర్వాత చానల్‌లో దుర్భాషలు ఆగిపోయాయని అవినాశ్ తెలిపాడు. త్వరలో తన ఇన్‌స్టాగాం చానల్ మోనిటైజేషన్ అవుతుందని, ఇవే రీల్స్‌ను యూట్యూబ్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలలో కూడా పోస్టు చేస్తానని అవినాశ్ తెలిపాడు.



రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్‌లో అవినాశ్ చేసిన రీల్స్

ముగ్గురు గురువులకు రాష్ట్రస్థాయి పురస్కారం

ఇద్దరు ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లకు, ఉర్దూ ఎస్‌జీటీకి

11న సీఎం చేతుల మీదుగా అవార్డు



రమేష్‌బాబు



మహమ్మద్ యాకూబ్

అనంతపురం విద్య, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముగ్గురిని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. ఇందులో అనంతపురం కార్పొరేషన్ పరిధిలోని శ్రీ పొట్టిశ్రీరాములు మున్సిపల్ స్కూల్‌లో పని చేసిన ఇం గ్లిష్ టీచర్ పొలమడ రమేష్‌బాబు, ఆత్మకూరు జడ్పీహైస్కూల్ ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ గండబత్తుల సుజాత, ఉర్దూ ఎస్‌జీటీ మహమ్మద్ యాకూబ్ ఉన్నారు. వీరు ఈ నెల 11న విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.



రాష్ట్ర స్థాయిలో జరిగిన ట్రైనింగ్‌లో యాకూబ్

ఉర్దూ సేవలో టీచర్ యాకూబ్

బెస్ట్ ఉర్దూ టీచర్‌గా ఎంపికైన మహమ్మద్ యాకూబ్ 2012 డీఎస్సీలో ఉద్యోగం పొందారు. తొలిగా లేపాక్షి ఎంపీపీ ఉర్దూ బాలికల పాఠశాలలో ఉర్దూ ఎస్‌జీటీగా విధుల్లో చేశారు. తర్వాత బదిలీల్లో భాగంగా 2021లో ఎన్పీకుంట మండలం పెడబల్లి స్కూల్‌కు వచ్చారు. తాను పనిచేసిన స్కూళ్లలో ఉర్దూ భాషాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తూ వచ్చారు. అనంతరం 2023లో జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో గార్లదిన్నె మండలం పీడబ్ల్యూడీ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌కు ఎస్‌జీటీ ఉర్దూ టీచర్‌గా వచ్చారు. సుమారు ఏడాదిగా అక్కడే పనిచేస్తున్నారు. 2017లో హజ్ అసిస్టెంట్‌గా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయగా హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు మక్కాలో ఉండి సుమారు రెండున్నర నెలలు సహాయ సహకారాలు అందించారు. 2021 నుంచి అమల్లోకి వచ్చిన 1వ తరగతి ఉర్దూ పుస్తకం రచయితగా వ్యవహరిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ, స్టేట్ సమగ్రశిక్ష ప్రాజెక్టు ఆధ్వర్యంలో పలు చోట్ల స్టేట్ రిసోర్స్‌పర్సన్‌గా పనిచేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో పలుశిక్షణా కార్యక్రమాల్లో భాగస్వామిగా మారి ఉర్దూ టీచర్లకు శిక్షణ అందించారు.

చాలా ఆనందంగా ఉంది

ఉర్దూ భాషకు సేవలు అందించినందుకు ఏపీ ఉర్దూ అకాడమీ నుంచి స్టేట్ బెస్ట్ ఉర్దూ టీచర్‌గా అవార్డు రావడం ఆనందంగా ఉంది. గతంలో నేను ఏనాడూ అవార్డు కోసం దరఖాస్తు చేయలేదు. నా వంతుగా ఉర్దూ భాష కోసం కృషి చేస్తూ ముందుకు వెళ్తున్నా. ఈ ఏడాది తొలిసారి దరఖాస్తు చేశా. అవార్డు రావడం ఆనందంగా ఉంది.

- మహమ్మద్ యాకూబ్

• విభిన్న బోధనా పద్ధతుల కంచుకంఠం రమేష్‌బాబు



ప్రధానోపాధ్యాయుల ట్రైనింగ్‌లో రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్న రమేష్‌బాబు

పొలమడ రమేష్‌బాబు అనంతపురం కార్పొరేషన్ స్కూళ్లలో పరిచయం అక్కరలేనివ్యక్తి. టీచర్‌గా ఎంతగా ప్రాచుర్యం పొందారో..అదే స్థాయిలో పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో వ్యాఖ్యాతగా తన కంచుకంఠంతో గుర్తింపు పొందారు. 1989లో ఎస్‌జీటీగా ఎంపికై, యల్లనూరు మండలం లింగారెడ్డిపల్లిలో తొలిపోస్టింగ్ పొందారు. తర్వాత స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందారు. 35 ఏళ్ల సర్వీసులో విభిన్న బోధనా పద్ధతులతో విద్యార్థులకు సులువుగా అర్థం అయ్యేలా పాఠాలు బోధించారు. ఈయన ఇంగ్లిష్ భాషపై రాష్ట్ర, జిల్లా స్థాయి శిక్షకులుగా పనిచేశారు. ఎంఈఓ, డైట్ కాలేజ్ అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయుల శిక్షణ, సచివాలయ ఉద్యోగుల శిక్షణ ఇలా అనేక కార్యక్రమాల్లో ఉత్తమ శిక్షకుడిగా సేవలందించారు. పదో తరగతి నమూనా పత్రాల ముద్రణ, డీసీఈబీ ద్వారా టెన్త్ విద్యార్థులకు అందించే అనంత సంకల్పం పుస్తకాల రూపకల్పనలో ఇంగ్లిష్ పాఠ్యాంశాలపై తనదైన ముద్ర వేశారు. జిల్లాలో మూడుసార్లు కలెక్టర్ నుంచి, ఒక సారి డీఈఓ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు.

చిత్తశుద్ధితో పనిచేసినందుకే..

నేను 1989 నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నా. నిజాయతీ, చిత్తశుద్ధి, అంకితభావంతో పిల్లలకు బోధించా. నా సేవ, ప్రతిభను గుర్తించి ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇచ్చినందుకు సంతోషంగా ఉంది. నా ఉపాధ్యాయ వృత్తి ప్రయాణంలో నా సతీమణి, తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది ఇచ్చిన సహకారం మరువలేనిది. నాకు శక్తి ఉన్నంత వరకూ ఒక గురువుగా సమాజానికి సేవలు అందిస్తూనే ఉంటా. - రమేష్‌బాబు

కొండ నాలుకకు మందేస్తే..!

- తెగులు నివారణకు రసాయన మందు పిచికారీ
- మొత్తం ఎండిపోయిన బీర పంట
- ఎరువుల దుకాణం నిర్వాహకుడి సూచనతోనే...
- తీవ్రంగా నష్టపోయామంటున్న కక్కలపల్లి రైతులు





దెబ్బతిన్న బీర తోట, ఎండిపోయిన విధంగా మారిపోయిన బీర ఆకులు

అనంతపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పంటకు తెగులు సోకిందని పురుగు మందులు పిచికారీ చేస్తే ఉన్న పంట మొత్తం దెబ్బతిని రైతులు లబోదిబోమంటున్నారు. రూరల్ మండలంలోని కక్కలపల్లి గ్రామానికి చెందిన రైతుల విషయంలోను ఇదే జరిగింది. పురుగు మందుల దుకాణం యాజమానుల నిర్వాకంతో తమకు నష్టం జరిగిందని వారు ఆరోపిస్తున్నారు.

రూ.లక్షల పెట్టుబడి నాశనం



దెబ్బతిన్న పంటను చూపుతున్న రైతు శేఖర్‌రెడ్డి

మండలంలోని కక్కలపల్లి గ్రామానికి చెందిన రైతులు శేఖర్‌రెడ్డి, రాజేంద్ర గ్రామ సమీపంలో రెండున్నర ఎకరాల్లో నెల రోజుల కిందట బీర పంట సాగు చేశారు. ఇప్పటి వరకు దాదాపు రూ.2.7లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం పంట పిందె, కాయదశలో ఉంది. అన్ని సవ్యంగా జరిగి ఉంటే ఇప్పటికి పంట కొంత కోత పడేది. అయితే పంటలో తెగుళ్లు కనిపించడం వాటి నివారణ కోసం ఈ నెల 4న రుద్రంపేట సమీపంలోని ఓ ఎరువుల దుకాణంలో పురుగు మందులు కొనుగోలు చేసి పిచికారీ చేశారు. ఆ మరుసటి రోజు నుంచే బీర తీగ ఆకులు వాడి ఎండిపోవడం ప్రారంభమైంది. బీర పిందెల పరిస్థితి కూడా ఇలాగే ఉండటంతో ఆందోళన చెందిన రైతులు తాము పురుగుమందులు కొనుగోలు చేసిన దుకాణం వద్దకు వెళ్లారు. నిర్వాహకుడికి విషయం వివరించారు. దీంతో ఆయన తోటను పరిశీలించాడు. మందు మోతాదు ఎక్కువైంది. ఏంకాదు అని చెప్పివెళ్లిపోయాడు. అయితే రోజురోజుకు పంట మరింతగా దెబ్బతింది. ఎరువుల దుకాణ నిర్వాహకుడి కారణంగానే తమకు ఈ పరిస్థితి దాపురించిందంటూ ఆ ఇద్దరు రైతులు వాపోతున్నారు.

ముంచిన ఎరువుల దుకాణం నిర్వాహకుడి సూచనలు



కాపుకొచ్చిన బీర కాయలను చూపుతున్న రైతు రాజేంద్ర

ఎరువుల దుకాణం నిర్వహకుడి సూచనలే తమను ముంచాయని రైతులు చెబుతున్నారు. వాస్తవానికి దుకాణం నిర్వహకుడు ఇచ్చిన పురుగు మందులు దాదాపు వెయ్యి లీటర్ల నీటిలో కలిపి కొట్టాలని పంట పరిస్థితిని చూసిన వారు అంటున్నారు. అయితే 450లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని దుకాణం నిర్వాహకుడు చెప్పడం.. ఆమేరకు తాము మందు పిచికారి చేయడంతో తమకు ఈ పరిస్థితి ఎదురైందని వాపోయారు. మందుల్లో కాపర్ శాతం ఎక్కువగా ఉండటంతో పంట దెబ్బతినట్లు తెలిపారు. మందు పిచికారీ చేసిన తరువాత ఎండిపోతున్న పంటకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టి ఉంటే ఇప్పుడీ పరిస్థితి ఉండేది కాదని ఆ రైతులు వాపోతున్నారు. అధికారులు తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

జేఎన్‌టీయూలో ముగ్గురు బెస్ట్ ప్రొఫెసర్స్

బెస్ట్ ప్రొఫెసర్లుగా ఎంపికైన వైశాలి గోర్పడే, చెన్నారెడ్డి, బెహర దిలీప్ కుమార్



అనంతపురం సెంట్రల్, నవబంబరు 9 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బెస్ట్ ప్రొఫెసర్లుగా ముగ్గురు ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అవార్డుల జాబితాను శనివారం ప్రకటించింది. జనరల్ పబ్లికేషన్స్, ప్రాజెక్టులు, పేటెంట్లు, అవార్డులు ఇలా 22 అంశాల్లో ప్రతిభ కల్గిన ప్రొఫెసర్లను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అవార్డులను అందజేస్తుంది. ఇందులో భాగంగా జేఎన్‌టీయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వైశాలి గోర్పడే, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ బెహర దిలీప్ కుమార్ ఉత్తమ అవార్డులకు ఎంపియ్యారు. వీరిని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, ఓఎస్‌డీటూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్యతో పాలు పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

ఇక నుంచి మూడు రోజులు

మంగళ, గురు, శుక్రవారాల్లో పింఛన్లకు మెడికల్ సర్టిఫికెట్లు

అనంతపురం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్లను ఇక నుంచి వారానికి మూడురోజులు జారీ చేస్తామని జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వ రరావు శనివారం విలేకరులకు తెలిపారు. ఇంతకుమునుపు వారంలో రెండు రోజులు మాత్రమే సర్టిఫికెట్లు ఇచ్చేవారన్నారు. అయితే అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన వారందరికి ఇక్కడే సరిఫికెట్లు ఇస్తుండటంతో రద్దీ పెరిగిందన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు ఇకనుంచి వారంలో మంగళ, గురు, శుక్రవారాల్లో డాక్టర్లు పింఛన్ కోసం అర్హులను పరిశీలిస్తారన్నారు.

ఈ రోగాలు ఉన్నవారికే...

తలసేమియా, సికిల్‌సెల్‌అనీమియా, హిమోఫిలియా, పక్షవాతంతో బాధ పడుతూ కుర్చీకే పరిమితమైనవారికి, కండరాల బలహీనత, వెన్నెముక బాధితులు చక్రాలకుర్చీ లేదా మంచాలకే పరిమితమైనోళ్లకు, దీర్ఘకాలికంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న వారికి, కాలేయం, గుండెమార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్నవారిని ఆమూడు రోజులు సంబంధిత డాక్టర్లు పరిశీలించి నిర్ధారిస్తారన్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆయా వ్యాధులకు సంబంధించిన బాధితులకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని అక్కడే ఆయా డాక్టర్లు వైద్యపరీక్షలు, వ్యాధి ఆపరేషన్ల సర్టిఫికెట్లు పరిశీలిస్తారన్నారు. ఆయా రోజులలో ఉదయం 9గంటల నుంచి 1గంట వరకు రిజిస్ట్రేషన్, మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు డాక్టర్లు పరీశీలించడం ఉంటుందన్నారు. తొమ్మిది రకాల వ్యాధులకు సంబంధించి రోజుకు వంద ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామన్నారు.

గ్రంథాలయ ఉద్యోగుల సంఘం

జిల్లా అధ్యక్షుడి ఎంపిక



కటిక జయరాం

అనంతపురం విద్య, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించినట్లు కటిక జయరాం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజుల కిందట కడపలో యూనియన్ రాయలసీమ ప్రాంతీయ సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, ఇతర రాష్ట్ర కమిటీ సభ్యులు అనంతపురం జిల్లా అడ్‌హక్ కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారని ఆయన పేర్కొన్నారు. తనతో పాటు ప్రధాన కార్యదర్శిగా బొజ్జ నాయక్, ఉపాధ్యక్షులుగా కృష్ణ, కోశాధికారిగా శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీగా ఇబ్రహీం, ప్రచార కార్యదర్శి రమేష్ నాయక్, కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్వర్లు, వెంకటరమణప్ప, ముత్యాలమ్మ, మల్లికార్జులను ఎంపిక చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

రామాంజినమ్మది హత్యే..?

- గతనెల 18న ఆమె అదృశ్యం
- పోలీసులు అదుపులో ముగ్గురు
- ఇంటి సమీపంలోనే చెత్తకుప్ప కింద మృతదేహం
- పరిచయమున్న వ్యక్తే నిందితుల్లో ఒకడు



రామాంజినమ్మ (ఫైల్)

అనంతపురం క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో అటెండర్‌గా పనిచేస్తూ గత నెల 18న కనిపించకుండా పోయిన రామాంజినమ్మ హత్యకు గురైంది. నగర శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో నివాసముంటున్న రామాంజినమ్మ గత నెల 17న విధులకు హాజరైంది. 18న ఉదయం ఆమె హత్యకు గురైనట్లు సమాచారం. ఆమె అదృశ్యంపై తొలుత అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. నాలుగు రోజుల కిందట ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది.

ఉదయం చంపి...

విశ్వసనీయ సమాచారం మేరకు.. రామాంజినమ్మ ఉంటున్న ఇంటి ఎదురుగా గత కొంత కాలం ఓ ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఆ నిర్మాణ పనికి వచ్చే ఓ యువకుడితో రామాంజినమ్మకు పరిచయమైంది. అది చనువుగా మారి సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ క్రమంలోనే ఆ యువకుడు మరో యువకుడితో కలిసి ఈ నెల 18న ఉదయం రామాంజినమ్మ ఇంట్లోకి వెళ్లారు. ఇద్దరూ ఆమెపై దాడి చేసినట్లు తెలిసింది. సుత్తితో కొట్టడంతో మృతి చెందింది. తర్వాత బీరువాలో ఉన్న బంగారు నగలు, రూ.40వేలు తీసుకుని వెళ్లారు. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో వచ్చి మృతదేహన్ని బయటకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో సీసీ కెమెరాలు పగలకొట్టారు. మృతదేహాన్ని ఆమె ఇంటి సమీపంలో ఓపెన్ ప్లేస్‌లో ఉన్న ఓ చెత్త కుప్పలో దాచిపెట్టారు. పైన రెండు బండరాళ్లు ఉంచారు. రామాంజినమ్మ అదృశ్యంపై కేసు నమోదు కావడంతో పోలీస్ బృందాలు గాలింపు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఆమె ఇంటి సమీపంలోనే దుర్వాసన రావడంతో వెతకగా రామాంజినమ్మ మృతదేహం లభించినట్లు సమాచారం.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలు

పుట్టపర్తి రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జనరల్ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్, పూర్తి చేసిన విద్యార్థులు జర్మనీలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ పరిజ్ఞానం, డిజిటల్ నైపుణ్యాలతో ప్రాథమిక పరీక్ష ఉంటుందన్నారు. బయోడేటా, విద్యార్హతలు, పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రం, అనుభవ సర్టిఫికెట్లు, వివాహ ధ్రువీకరణ పత్రం, కోవిడ్ ఎంఎంఆర్ సర్టిఫికెట్‌జత పరచాలన్నారు. జర్మనీలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు రూ.24వేల నుంచి రూ.35వేల వరకు జీతం లభించవచ్చని, గుంటూరులో ఆరు నెలల శిక్షణ ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వీసా ఫీజు, రానుపోను విమాన టికెట్లు, సీయాఆర్పీ ఆర్థిక సహకారం ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకోవాల్సిన అభ్యర్థులు కాల్ సెంటర్ 9988853335 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

న్యూస్‌బాక్స్

రాయితీ పాస్‌ల కోసం సంప్రదించండి

రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ



అనంతపురం న్యూటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వే రాయితీ పాసుల కోసం సోమవారం రైల్వే స్టేషన్‌లోని చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తగిన అర్హత, ధ్రువీకరణ పత్రాలను అందజేస్తే వాటిని ఉన్నతాధికారులకు పంపి అర్హులైన వారందరికి రాయితీ కల్పిస్తామన్నారు. రాయితీకి అర్హులైన దరఖాస్తుదారుల ఫోన్‌కు సమాచారం వస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో కూడా పరిశీలించుకోవచ్చన్నారు. మిగిలిన రోజుల్లో జిల్లాలోని ఇతర స్టేషన్లలో పరిశీలనకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు.

టమోటా కిలో రూ. 23

అనంతపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 16, కనిష్ఠ ధర రూ. 10 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.30వేలు

అనంతపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 30వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 24వేలుతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 86 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

975 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 975 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే అవుట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 1027 క్యూసెక్కులు వెళుతోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.634 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రేపు మైనార్టీ వెల్ఫేర్, నేషనల్ ఎడ్యుకేషన్ డే

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మైనార్టీ వెల్ఫేర్, నేషనల్ ఎడ్యుకేషన్ డే నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఏడీ రామసుబ్బారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. క్లాక్ టవర్ వద్దనున్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విగ్రహానికి సోమవారం ఉదయం 10 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం జడ్పీలోని మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన జన్మదిన వేడుకలు నిర్వహిస్తామన్నారు.

కొర్రపాడులో ఘర్షణ

ఎనిమిది మందికి గాయాలు

బుక్కరాయసముద్రం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్రపాడులో రస్తా విషయంలో శనివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఎనిమిది మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. గ్రామంలో తలారీ నాగభూషణం, తలారీ పరమేశ్ మధ్య భూముల రస్తా విషయంలో వివాదం ఉంది. గతంలో గొడవల కారణంగా ఇరువర్గాలపై కేసులు నమోదు అయ్యాయి. తాజాగా మరోమారు గొడవపడ్డారు. ఇరువర్గాలవారు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. ఒక వర్గానికి చెందిన తలారీ నాగభూషణం, అతని బంధువు చిన్న ఎర్రిస్వామి, అలివేలమ్మ, నాగేంద్ర, మరో వర్గానికి చెందిన తలారి పరమేశ్, అతని బంధువు ఆనంద్, మునీశ్వరీ, కార్తీక్ గాయపడ్డారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. గాయపడిన వారు అనంతపురం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నగరంలో రైతు ఆత్మహత్య



అనంతపురం క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కనగానపల్లి మండలం గుంతపల్లికి చెందిన రైతు చెన్నకోట నరసింహులు (51) శనివారం రాత్రి నగరంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపిన మేరకు... నరసింహులు శనివారం సాయంత్రం అరవింద నగర్ బ్రిడ్జి వద్ద పడిపోయి ఉన్నాడు. ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఊజిమాత్రలు మింగినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఐదెకరాల పొలం ఉంది. మరి కొంత భూమి కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసేవాడు. ఈ క్రమంలో అప్పులు చేసినట్లు సమాచారం. తాజాగా టమోట పంటలోనూ నష్టం రావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇతడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరాశలో తెలుగు తమ్ముళ్లు...!

రెండో జాబితాలోనూ పదవులు దక్కకపోవడంతో అసంతృప్తి

అహుడా చైర్మన్‌గా జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్

ఆర్టీసీ కడప రీజనల్ చైర్మన్‌గా జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు



అనంతపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి, నామినేటెడ్ పదవుల ఆశించిన కొందరు టీడీపీ ముఖ్య నాయకులకు శనివారం విడుదల చేసిన నామినేటెడ్ చైర్మన్ల జాబితా నిరుత్సాహం కలిగించింది. తొలిజాబితాతో పాటు రెండో జాబితాలోనూ నిరాశే ఎదురుకావడంతో తెలుగు తమ్ముళ్లలో నిర్వేదం నిండుకుంది. తొలి జాబితాలో రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డికి సీడాప్ చైర్మన్ పదవి ఇచ్చారు. మరో నలుగురు డైరెక్టర్లతో సరిపెట్టారు. రెండో జాబితాలో ఎక్కువ మందికి నామినేటెడ్ పదవులు దక్కుతాయనే ఆశ తెలుగు తమ్ముళ్లల్లో ఉండేది. దాదాపు నెలన్నర కసరత్తు తర్వాత విడుదల చేసిన రెండో జాబితాలో కేవలం టీడీపీలో ఒక్కరికి, జనసేన తరఫున మరొకరికి చైర్మన్ పదవులు దక్కాయి. దీంతో నామినేటెడ్ పదవులు ఆశించిన నాయకులకు రెండో జాబితా నిరాశనే మిగిల్చింది.

ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా పూల నాగరాజు



తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు, జడ్పీ మాజీ చైర్మన్, టీడీపీ వాల్మీకి, బోయ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పూల నాగరాజుకు కడప ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పదవి లభించింది. రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన ఆయన సుదీర్ఘకాలంగా టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో జడ్పీ చైర్మన్‌గా మొదటి మూడేళ్లు చమన్ సాబ్ పనిచేయగా... ఆ తర్వాత రెండేళ్లు పూల నాగరాజు పనిచేశారు. సామాజిక కోణంలో భాగంగానే పూల నాగరాజుకు నామినేటెడ్ పదవి దక్కినట్లు తెలుస్తోంది.

అహుడా చైర్మన్‌గా టీసీ వరుణ్



జనసేన జిల్లా అధ్యక్షుడు, అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న టీసీ వరుణ్‌కు జనసేన పక్షాన అహుడా చైర్మన్ పదవి దక్కింది. జనసేన ఆవిర్భావం నుంచి టీసీ వరుణ్ పార్టీ కోసం పనిచేస్తున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనసేన అనంతపురం అర్బన్ నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు. అయితే కూటమి పొత్తులో భాగంగా ఆ అవకాశం వరుణ్‌కు దక్కలేదు. టీడీపీ అభ్యర్థి విజయం కోసం పనిచేశారు. దీంతో పాటు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కుటుంబానికి సన్నిహితుడు కావడంతో వరుణ్‌ను నామినేటెడ్ పదవి వరించింది.

మూడో జాబితాపైనే ఆశలన్నీ..

తొలి రెండు జాబితాల్లో నామినేటెడ్ పదవులు దక్కక తీవ్ర అసంతృప్తి, నిరాశకు లోనైన ఆశావహులు మూడో జాబితాపై ఆశలు పెట్టుకున్నారు. సుదీర్ఘకాలం పాటు పార్టీ కోసం పనిచేస్తున్న కొందరు ముఖ్యనాయకులకు నామినేటెడ్ పదవులు దక్కుతాయని వారి వర్గీయులు భావించారు. అయితే అది సాధ్యం కాలేదు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సార్వత్రిక ఎన్నికలకు ముందు చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతంలో కీలకంగా వ్యవహరించిన నాయకులు కొందరు నామినేటెడ్ పదవులు దక్కుతాయని ఆశించారు. అది సాధ్యం కాకపోవడంతో మూడో జాబితాలో నైనా అవకాశం కల్పిస్తారనే ఆశాభావంలో ఉన్నారు. ఇప్పటి వరకు మొదటి, రెండు జాబితాల్లో 70కిపైగా నామినేటెడ్ పదవులు భర్తీ చేశారు. మరో 70కిపైగా పదవులు భర్తీ చేయాల్సి ఉంది. ఈనేపథ్యంలో ఆశావహులందరూ మూడో జాబితా కోసం ఎదురు చూస్తున్నారు.

క్రైంకార్నర్

బావిలో గల్లంతైన కూలీ మృతి

24 గంటలు శ్రమించిన అధికార యంత్రాంగం

మృతదేహం వెలికితీత



రామాంజనేయులు (ఫైల్)

ధర్మవరంరూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పాడైపోయిన మోటారును తీసేందుకు బావిలోకి దిగి గల్లంతైన రైతుకూలీ మృతి చెందిన సంఘటన విషాదంగా ముగిసింది. కనగానపల్లి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన రైతు కూలీ దాసరి రామాంజనేయులు (44) ధర్మవరం మండలం కట్టకిందపల్లి వద్ద పాడైపోయిన మోటర్‌ను తీసేందుకు బావిలోకి వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. బావిలో ఎక్కువగా నీరు ఉండటంతో రామాంజనేయులు ఆచూకీ లభించలేదు. రెస్క్యూ టీం, రెవిన్యూ, అగ్నిమాపక సిబ్బంది స్థానిక ప్రజల సహాయంతో ముమ్మరంగా గాలించారు. అధిక నీళ్ల ఉండటంతో మోటార్లు బిగించి బయటకు తోడారు. రాత్రి కావడంతో లైట్లు వేసి గాలించారు. అయినప్పటికీ నీళ్ల తగ్గుముఖం పట్టకపోవడంతో శనివారం ఉదయం మరిన్ని మోటార్లు తెప్పించి తోడేశారు. దాదాపు 24గంటల పాటుఅధికార యంత్రాంగం శ్రమించి బావిలో ఉన్న రామాంజనేయులు మృతదేహాన్ని బయటకు వెలికితీశారు. ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య కళావతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామాంజనేయులు బావిలో పడ్డాడని తెలుసుకున్న ముక్తాపురం గ్రామస్థులతో కాక చుట్టుపక్కన గ్రామాల ప్రజలు పెద్దఎత్తున సంఘటన స్థలం వద్దకు చేరుకుని రెండురోజులుగా అక్కడే ఉన్నారు. మృతదేహాన్ని వెలికితీయడంతో కుటుంబీకులు, బంధువులతో పాటు అక్కడున్న వారు రోదనలు మిన్నంటాయి.

యుద్ధప్రాతిపదికన చర్యలు

రైతుకూలి రామాంజనేయులు బావిలో మునిగిపోయాడన్న విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఓదార్చి బయటకు తీసేందుకు అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే కలెక్టర్, రాష్ట్ర రెవిన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్డీఓ మహేష్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్‌బాబు, ఎస్ఐ శ్రీనివాసులు, అగ్నిమాపక అధికారులు 24గంటల పాటు శ్రమించి రామాంజనేయులు మృతదేహాన్ని వెలికితీశారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

11 నెలల తర్వాత మృతుడి వివరాలు లభ్యం

ధర్మవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఓ వ్యక్తి ఆచూకీ దాదాపు 11 నెలలు తరువాత లభ్యమైంది. వేలిముద్రల నిపుణుల పరిశీలన తరువాత మృతుడి పూర్తి వివరాలు లభ్యమైనట్లు హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గత ఏడాది డిసెంబరు 28న ధర్మవరం రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు కిందపడి మృతిచెందాడు. అప్పట్లో ఆయన ఆచూకీ లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆ సందర్భంగా మృతుడి వేలిముద్రలు తీసుకుని నిపుణులకు పంపారు. దాదాపు 11 నెలల తరువాత శుక్రవారం మృతుడి వివరాలు నిపుణుల ద్వారా తెలిశాయి. కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన నాగరాజు(38)అని తేలిందన్నారు. అతడు కళ్యాణదుర్గం పోలీస్‌స్టేషన్‌లో 2008లో ఓ హత్య కేసులో ముద్దాయి అని, శిక్షను అనుభవించి జైలు నుంచి బయటకు వచ్చి ధర్మవరం చుట్టు పక్కల బేల్దారి పనులు చేసుకుంటూ జీవనంసాగించేవాడని రైల్వే హెచ్‌సీ తెలిపారు. 2022లో మృతుడి కుమారుడు ఆంజనేయులు కూడా జంగాలపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో రైలుకిందపడి మృతి చెందాడు. దీంతో నాగరాజు ఒంటరి జీవితాన్ని భరించలేక గత ఏడాది ధర్మవరం డీఎల్ఆర్ కాలనీ వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుడి తల్లి రామాంజినమ్మ, తమ్ముడు రామచంద్ర తెలిపారన్నారు.



నాగరాజు(ఫైల్)

దొంగ అల్లుడు..!

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

నిందితుడి అరెస్టు.. 6.5 తులాల బంగారం నగల స్వాధీనం

ధర్మవరం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామంలో బంగారం నగలు చోరీ కేసులో ఇంటి అల్లుడే దొంగ అని పోలీసులు నిర్ధారించారు. శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులు చోరీ కేసుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. ఈ నెల 5న గొట్లూరు గ్రామంలో సాకే ఓబులమ్మ ఇంటితాళాలు పగలగొట్టి 6.5 తులాల బంగారు నగలను చోరీ చేశారని తెలిపారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టగా ఇంటి అల్లుడే దొంగ అని విచారణలో తేలిందన్నారు. నిందితుడు చందమామ రవి ధర్మవరం పట్టణం ఇందిరమ్మకాలనీకి చెందిన వాడని, ఓబులమ్మకు పెద్ద అల్లుడు అని అన్నారు. రవి భార్య పుష్పాంజలితో గొడవపడి విడిపోయారన్నారు. పుష్పాంజలి పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటోందన్నారు. రవి తన కూతురికి ఆరోగ్యం బాగాలేదని చూడటానికి గొట్లూరు గ్రామానికి వెళ్లాడని తెలిపారు. ఇంటివద్ద ఎవరూ లేకపోవడంతో ఇదే అదునుగా తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు నెక్లెస్, డాలర్, నాలుగు జతల కమ్మలు, మరి కొన్ని నగలను ఎత్తుకెళ్లాడని తెలిపారు. ధర్మవరం మండలం నాగలూరు గ్రామ బస్టాప్ వద్ద చందమూరు రవిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. అతడి వద్ద 6.5 తులాల బంగారం నగలను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగరాజు ఉన్నారు



పట్టుబడిన బంగారం నగలను చూపుతున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు

బంగారం గొలుసు అపహరణ

ధర్మవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదానగర్‌లో గుర్తు తెలియని దొంగలు ఓ మహిళ మెడలో నుంచి బంగారం గొలుసును అపహరించారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శాంతినగర్‌కు చెందిన రాములమ్మ శారదానగర్‌లో ఉన్న తన బిడ్డ ఇంటికి వెళ్తుండగా ఇద్దరు దుండగులు ముఖానికి మాస్కులు వేసుకుని వచ్చి తన మెడలో ఉన్న 3.5 తులాల బంగారం గొలుసును లాక్కొని పరారయ్యారన్నారు. స్థానికులు సమాచారం అందించడంతో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డెప్ప సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి బాధితురాలితో వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

వాహనాల దొంగ అరెస్టు

24 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

గార్లదిన్నె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడిన యువకుడిని అరెస్టు చేసి, 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేసులు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన యువకుడు శంకర్‌సాయికుమార్ పదో తరగతి వరకు చదువుకున్నాడు. విలాసవంతమైన జీవితం గడపడానికి అప్పులు చేశాడు. చేసిన అప్పులను తీర్చే క్రమంలో దొంగగా మారాడు. అనంతపురం, కర్నూలు, నంద్యాల తదితర జిల్లాల్లో పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించి, బెంగళూరు, బళ్లారి వంటి దూరప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకునేవాడు. ఇటీవల కల్లూరు గ్రామంలోని నీలం సంజీవరెడ్డి సర్కిల్లో ఈడిగ తిరుపాల్ ద్విచక్ర వాహనం చోరీ అయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయ సమీపంలో ఓ పాడుబడిన రేకుల షెడ్డులో వాహనాలను దాచిపెట్టి అమ్ముకోవడానికి బెంగళూరుకు వెళుతుండగా గార్లదిన్నె పోలీసులు అరెస్టు చేశారు. అతడిని విచారించి, సుమారు రూ.15లక్షలు విలువ చేసే 24 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు..



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను చూపుతున్న పోలీసులు

టీడీపీ నాయకుడిపై దాడి.. ఐదుగురిపై కేసు

గుంతకల్లు టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొలకలపెంట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జయరాముడుపై దాడి జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు, మాజీ సర్పంచు రంగమ్మ కుమారుడైన జయరాముడు గుంతకల్లుకు వెళ్లి శుక్రవారం రాత్రి స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా.. అదే గ్రామానికి చెందిన దండు శ్రీనివాసులు, తలారి దివాకర్, తలారి సూర్యనారాయణ, తలారి తిక్కస్వామి, తలారి ఉదయ్ కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ విషయాన్ని జయరాముడు తన సోదరుడికి ఫోన్ చేసి తెలిపాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని అతడిని సోదరుడు చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అక్క కుమారులు దాడి చేశారని బాధితుడి కుటుంబసభ్యులు ఆరోపించారు. ఐదుగురిపై కేసు నమోదు చేశామని కసాపురం ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు.

రైతు ఇంట్లో చోరీ

గుత్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌బీఐ వీధికి చెందిన రైతు నాగిరెడ్డి ఇంట్లో దొంగలు పడ్డారు. వ్యవసాయ పనుల నిమిత్తం తన స్వగ్రామానికి భార్య శ్రీదేవితో కలిసి నాలుగు రోజుల క్రితం వెళ్లారు. శనివారం తిరిగి వచ్చేలోగా ఇంట్లోకి చొరబడి 9 తులాల బంగారు ఆభరణాలు, 3 కేజీల వెండిని ఎత్తుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ సురేష్ సంఘటన స్థలాన్నిన్ని పరిశీలించారు.



చెల్లాచెదురుగా పడిన దుస్తులు

ఖోఖో విజేత ఎస్ఎస్‌జీడీ కళాశాల

ముగిసిన క్రీడా పోటీలు



ఖోఖో జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జెస్సీ, కళాశాల డైరెక్టర్ గోపాల్

గుంతకల్లుటౌన్,నవంబరు9 (ఆంధ్రజ్యోతి): ఎస్కే యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ పురుషుల గ్రూప్ సీ క్రీడా పోటీల విజేతగా ఎస్ఎస్‌జీడీ (శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ) కళాశాల నిలిచింది. పట్టణంలోని ఎస్ఎస్‌జీడీ కళాశాలలో శనివారం ఎస్కే యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ పురుషుల గ్రూప్ సీ క్రీడా పోటీలు ముగిశాయి. ఖోఖోలో ఎస్ఎస్‌జీడీ కళాశాల విన్నర్‌గా, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రన్నర్‌గా నిలచింది. హ్యాండ్‌బాల్‌లో తాడిపత్రి నారాయణ బీఈడీ కళాశాల విన్నర్‌గా, అనంతపురం ఆర్ట్స్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. ఫుట్‌బాల్‌లో పుట్టపర్తి మంగళకర జగరాజుపల్లి కళాశాల విన్నర్‌గా, అనంతపురం ఆర్ట్స్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. రగ్బీ పోటీలో అనంతపురం ఆర్ట్స్ కళాశాల విన్నర్‌గా, అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. వీరికి ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జెస్సీ, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ గోపాల్ చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే వెంకటేశ్వర్లు, కళాశాల పీడీ మహబూబ్ బాషా, కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాలల పీడీలు తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్యా..!

ఆంధ్రజ్యోతికి స్పందన

వ్యవసాయ శాఖ ఎంపీఈఓల ఓడీలు రద్దు

ఎట్టకేలకు 106 మంది ఎంపీఈఓలకు విముక్తి

అనంతపురం అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న 106 మంది వ్యవసాయ శాఖ ఎంపీఈఓలకు విముక్తి లభించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓల అవస్థలపై పలు మార్లు 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కూడా అక్కడ పనిచేస్తున్న ఎంపీఈఓలను తిరిగి జిల్లాకు పంపాలని లేఖలు రాశారు. మరికొందరు ఫోన్ ద్వారా కోరారు. ఈ నేపథ్యంలో స్పందించిన వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓల ఓడీలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు అన్నమయ్యలో పనిచేస్తున్న ఎంపీఈఓలను రిలీవ్ చేయాలని ఆయా జిల్లాల వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో తిరిగి వారికి పోస్టింగ్‌లు ఇవ్వాలంటూ ఇక్కడి జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. వైసీపీ హయాంలో అవసరం లేకపోయినా అనంత ఉమ్మడి జిల్లా నుంచి 253 మంది వ్యవసాయ శాఖ ఎంపీఈఓలను ఓడీపై ఉమ్మడి చిత్తూరుకు పంపారు. వీరిలో ప్రస్తుతం 106 మంది అక్కడ ఓడీపై పనిచేస్తున్నారు. మిగతా సిబ్బంది దూర ప్రాంతంలో పనిచేయలేక, ఇతర కారణాలతో ఉద్యోగం వదిలేశారు. ఓడీలు రద్దు కావడంతో అక్కడ పనిచేస్తున్న 106 మంది ఎంపీఈఓలు మరో రెండు రోజుల్లో తిరిగి ఉమ్మడి అనంత జిల్లాకు రానున్నారు.

వైద్యానికి సాయం చేయండి

రాయదుర్గం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాశీపురం గ్రామానికి చెందిన కావలి శైలజ, ప్రభాకర్ దంపతుల కుమారుడు గౌతమ్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తల్లిదండ్రులు పేదవారని, వైద్యానికి సాయం చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు వాల్మీకి సంఘం నాయకులు విన్నవించారు. దాతలు కొంత సాయం చేశారని, ఆ సొమ్ము చాలడం లేదని ఎమ్మెల్యేకి తెలిపారు. దీంతో ఆయన ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడారు. మెరుగైన వైద్యం చేయాలని సూచించారు. బాలుడి వైద్యానికి సాయం చేస్తానని భరోసా ఇచ్చారు. కాశీపురం మాజీ ఎంపీటీసీ కావలి లక్ష్మణ, కావలి రవి, బోయ మల్లికార్జున, ఆర్ఎంపీ వాల్మీకి పవన్‌కుమార్, ఉపాధ్యాయుడు అంజి ఎమ్మెల్యేని కలిశారు.

ఐఐటీలతో జేఎన్‌టీయూ అనుసంధానం

ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు పాటించేలా ఐఐటీలతో జేఎన్‌టీయూ అనుసంధాన ప్రక్రియను చేపట్టామని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థి, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ సతీశ్‌రెడ్డి జిల్లాకు వచ్చిన సందర్భంగా శనివారం వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో ఇన్‌చార్జ్ వీసీ పలు అంశాలపై చర్చించారు. జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థులు వివిధ స్థాయిల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. వారిలో అనేకమంది వర్సిటీ అభివృద్ధికి పలురూపాల్లో సహాయ, సహకారాలందించడం జరుగుతోందని తెలిపారు. జాతీయస్థాయి అధికారిగా ఇస్రో, డీఆర్‌డీఓ, ల్యాబ్స్, ఆర్మీ ఆఫీసర్స్‌తో జేఎన్‌టీయూ విద్యార్థులకు వారానికి ఒకసారి లెక్చర్ ఇప్పించేందుకు కృషి చేయాలని సతీశ్‌రెడ్డిని కోరారు. స్టార్టప్ కంపెనీలు, ఐఐటీలతో టైఅప్‌కు సహాయపడాలని కోరారు. వర్సిటీ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని సతీశ్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీటూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య, డైరెక్టర్లు సత్యనారాయణ, సుజాత, కిరణ్మయి, వైశాలి గోర్పాడే, సుబ్బారెడ్డి, సురేష్‌బాబు, భానుమూర్తి, ప్రశాంతి, పద్మసువర్ణ, ఈశ్వర్‌రెడ్డి, ఏపీ శివకుమార్, కోఆర్డినేటర్లు శారద, అరుణమస్తాని, అరుణ, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర పాల్గొన్నారు.

రూ.వందతో కార్యకర్తకు ఆర్థిక భరోసా
- మాజీ మంత్రి పల్లె



పుట్టపర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేవలం వంద రుపాయ ల సభ్యత్వంతో కార్యకర్తలకు ఆర్థిక భరోసా ఇస్తున్న ఏకైక పార్టీ టీడీపీ అని మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి పల్లెరఘునాథరెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం సభ్యత్వంపై పుట్టపర్తిరూరల్, అర్బన్, బుక్కపట్నం నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మా ట్లాడుతూ ఎమ్మెల్యేగా పల్లెసింధూరారెడ్డిని గెలిపించడంలో పార్టీ కుటుంబసభ్యుల కృషి అభినందనీయమన్నారు. వెంగలమ్మచెరువు, పెడపల్లి ప్రాంతాలలో అత్యధిక సభ్యత్వాన్ని చేయడంపై ఆ గ్రామాల నాయకులను అభినందించారు. దేశంలోనే కార్యకర్తలకు ఆర్థిక భరోసా ఇస్తున్న పార్టీ టీడీపీనేనన్నారు. వంద రుపాయిలు సభ్యత్వంతో రెండేళ్లపాటు ప్రమాద బీమా భరోసాను ఇస్తుందన్నారు. సభ్యత్వ నమోదులో నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపేలా కృషిచేయాలన్నారు. నాయకులు ఆదినారాయణరెడ్డి, విజయ్‌కుమార్, శ్రీరామ్‌నాయక్, శ్రీరామిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలోనే మైనార్టీలకు గుర్తింపు



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

కొత్తచెరువు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలోనే మైనార్టీలకు గుర్తింపు అని ఆ పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు షరుత్బిద్దీన్ అన్నారు. శనివారం కొత్తచెరువులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు ముస్లిం, మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. అందులో భాగంగా ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మౌలాన అబ్దుల్ ముస్తక్ అహమ్మద్‌ను నియమించారన్నారు. అలాగే ఏపీ గవర్నమెంట్ ఆఫ్ అడ్వైజర్‌గా క్యాబినెట్ ర్యాంక్ హోదాతో మహమ్మద్‌షరీఫ్‌ను నియమించడం ఇందుకు నిదర్శనమన్నారు. సైకిల్‌షాపు బాబా, అల్లాబకాష్, రహంతుల్లా, షబ్బీర్, నబీ పాల్గొన్నారు.

పీఏబీఆర్ కాలువను శుభ్రం చేయించండి



కాలువను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

బత్తలపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కాలువను శుభ్రం చేయించి నీటిని విడుదల చేయాలని రైతులు కోరారు. మండల కేంద్రంలో శనివారం టీడీపీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. బత్తలపల్లి చెరువుకు నీరందించే పీఏబీఆర్ కాలువ ముళ్ల పొదలు పెరిగి అధ్వానంగా మారిందని పలువురు రైతులు నాయకుల దృష్టికి తెచ్చారు. అనంతరం టీడీపీ నాయకులు కాలువను పరిశీలించారు. కార్యక్రమంలో మండల కన్వినర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, జక్కంపూటి నాగభూషణ, రమణ, బాబు, మనోజ్ పాల్గొన్నారు.

వర్షపు నీరు తొలగింపు



అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీటిని తోడేస్తున్న దృశ్యం

ధర్మవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్ అండర్ బ్రిడ్జికింద ఉన్న వర్షపు నీటిని మోటారు ద్వారా తొలగించారు. 20 రోజులుగా అండర్ బ్రిడ్జికింద వర్షంపు నీరు నిల్వఉంది. అటువైపు వెళ్లే ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. స్పందించిన టీడీపీ నాయకులు యుగందర్, సూరి దగ్గరుండి మోటారును ఏర్పాటుచేయించి బ్రిడ్జి కింద ఉన్న వర్షపునీటిని తొలగించారు.

అపార్ నంబరు విద్యార్థులకు ఉపయోగకరం

కొత్తచెరువు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి ఆధార్ నెంబర్ ఎంత ముఖ్యమో చదువుకుంటున్న విద్యార్థులకు అపార్ నెంబర్ ఎంతో ఉపయోగపడుతుందని సత్యసాయిజిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి(డీఐఈఓ)రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సత్యసాయిజిల్లాలో ఇంటర్ చదువుతున్న ప్రతి విద్యార్థి అపార్ నెంబర్ పొందాలని ఆయన సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు తమ కళాశాలలోని పిల్లలకు అపార్ నెంబర్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అపార్ నెంబర్ పొందితే దేశంలో ఎక్కడ చదువుకుంటున్న ఆ విద్యార్థి చదువుకు సంబంధించిన విషయాలను ఆన్‌లైన్‌లో చూడవచ్చన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలకు అపార్ నెంబర్ పొందే విధంగా చూడాలని ఆయన కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కలేనా..?



- ఎన్నోఏళ్లుగా ఎదురు చూపులు
- వైద్యం కోసం 30కి.మీ. ప్రయాణం
- అత్యవసర పరిస్థితుల్లో అంతే సంగతులు
- వైసీపీ పాలనలో అటకెక్కిన ప్రతిపాదనలు
- కూటమి ప్రభుత్వంలోనైనా మంజూరయ్యేనా?

తనకల్లు, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో మల్లిరెడ్డిపల్లి పంచాయతీ ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే 35 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంది. మల్లిరెడ్డిపల్లి, పెద్దమరవపల్లి, వడ్డుమరవపల్లి, నక్కరాళ్లతండా, సుబ్బరాయునిపల్లి, నడిమికుంటపల్లి, రత్నగిరి, గొళ్లపల్లి, బాబేనాయక్‌తండా, ఎర్రబల్లి, ఎర్రగుట్టపల్లి, గుర్రంబైలు, ఆదిరెడ్డిపల్లి, ముండ్లవారిపల్లి పంచాయతీలోని పెండ్లిగుండుతండా, బులేనాయక్‌తండా, యనుములవారిపల్లి, బీమ్లానాయక్‌తండా, దండువారిపల్లి, కోటపల్లి పంచాయతీలోని కోటపల్లి, చిన్నపల్లి, చిన్నపల్లికాలనీ, మబ్బువారిపల్లి, గేమేనాయక్‌తండా పంచాయతీలోని కమతంపల్లి, రతినేనాయక్‌తండా, అర్ధానంపల్లి, గ్రామాల వారికి మల్లిరెడ్డిపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రముంటే సౌకర్యంగా ఉంటుందని ప్రజలు ఏన్నేయేళ్లుగా విజ్ఞప్తులు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగి ఆయా గ్రామాల ప్రజలు వినతులు ఇచ్చినా పట్టించుకునే నాథుడే లేడు. రోగాలు వస్తే ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. విషపురుగులు కాటు వేస్తే కర్ణాటక రాష్ట్రం చాకివేలు, చేలూరు, అన్నమయ్యజిల్లాలోని కందుకూరు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీపాలనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. అప్పట్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరవుతుందని ఎంతో ఆశగా ప్రజలు ఎదురు చూశారు. అయితే మంజూరుకాలేదు. అప్పట్లో జన్మభూమి కార్యాక్రమాలను కూడా ప్రజలు అడ్డుకుని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పట్టుపట్టారు. ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రతిపాదనలు అటకెక్కాయి. ప్రజలు పలుమార్లు విజ్ఞాప్తులు చేసినా, స్పందించకపవడంతో మానేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకిరావడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై ప్రజలకు ఆశలుచిగురిస్తున్నాయి. కూటమి పాలనలోనైనా ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం మంజూరు కాకపోతుందా అని వేయికళ్లతో ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మల్లిరెడ్డిపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కూటమిలోనైనా ఆరోగ్యకేంద్రం వస్తుందా?



గత టీడీపీ పాలనలో మల్లిరెడ్డిపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వస్తుందని ప్రతిపాదనలు పంపి, ఎదురు చూశాం. అప్పట్లో అన్ని మండలాలకు రెండు ప్రాథమిక కేంద్రాలు మంజూరు చేశారు. మాకు కూడా మంజూరవుతుందనుకున్నాం. కానీ కాలేదు. వైసీపీ పాలనలో ప్రతిపాదనలను అట్టకెక్కించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామస్థులందరూ ప్రాథమిక కేంద్రం వస్తుందన్న ఆశలో ఎదురు చూస్తున్నారు.

- చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, పెద్దపల్లి

ఆసుపత్రికి స్థలాన్ని విరాళంగా ఇస్తాం



ప్రభుత్వం ప్రాథమిక కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే, కావల్సినంత స్థలాన్ని విరాళంగా అందిస్తాం. గ్రామస్థులందరూ ఇచ్చినమాటకు కట్టుబడి ఉన్నాం. ఆసుపత్రి లేకపోవడంతో ఏచిన్న సమస్య వచ్చినా, ప్రమాదం జరిగినా అన్నమయ్య జిల్లాలోని కందుకూరుకు, కర్ణాటకకు వెళ్లాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మల్లిరెడ్డిపల్లికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయించాలి.

- బత్తిలి బ్రహ్మానందరెడ్డి, రైతు, ఎర్రబల్లి

అవసరమైతే నిధులు కూడా సమకూరుస్తాం



ప్రభుత్వం మల్లిరెడ్డిపల్లి గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేస్తే, అందుకు అవసరమైన నిధులుకూడా సమకూరుస్తాం. ప్రభుత్వానికి గ్రామస్థులు అన్నివిధాల సహకరించడానికి సిద్ధంగా ఉన్నాం. వైసీపీ పాలనలో అట్టకెక్కిన ప్రతిపాదనలను కూటమి నాయకులు దుమ్ముదులిపి మంజూరుకు ప్రయత్నించాలి.

- నాగమల్లు, మాజీ సర్పంచ్

ఎవరికీ పట్టదా..?

- అభివృద్ధికి నోచుకోని వేమన ఆలయం
- టూరిజం శాఖ నిర్లక్ష్యం
- ఇబ్బంది పడుతున్న పర్యాటకులు

గాండ్లపెంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వేమనంటేనే తెలుగువారి నోటిలో నానుడి పదం. అలాంటి యోగివేమన జీవసమాధి మండలంలోని కటారుపల్లిలో ఉండడం విశేషం. పండితులనుంచి పామురుల వరకు నిత్యం వేమన పద్యాలు స్మరిస్తూ ఉంటారు. తెలుగు పదానికి, తెలుగువారికి జీవం పోసిన విశ్వకవి వేమన ఆలయాభివృద్ధిపై అధికారులకు పట్టడం లేదు. 2008లో ఏపీ టూరిజం ఆధ్వర్యంలో వేమన ఆలయాన్ని రూ.1.50 కోట్ల నిధులతో ఆహ్లాదకరంగా, సుందరంగా తీర్చిదిద్దారు. వేమన ఆలయ ఆవరణలో వందలకొద్దీ వేమన పద్యాలు, వేమన ఆలయం బయట ఏపీ టూరిజం వారు వసతి గృహాలు, రెస్టారెంట్, చిన్నారులకోసం పార్కును నిర్మించారు. అప్పట్లో చేపట్టిన పనులే తప్ప ఇంతవరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదు. టూరిజం వారు రెస్టారెంట్, విడిది గృహాలకు ఇంతవరకు పెయింట్ వేసిన దాఖలాలు లేవు. పార్కుల్లో పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు ముళ్ల కంపలతో నిండుకున్నాయి. మరోవైపు ప్రహరీ కూడా కూలిపోయింది. దీంతో పశువులుసైతం లోనికి వస్తున్నాయి. కర్ణాటక, నెల్లూరు, కడప, కర్నూలు తదితర ప్రాంతాలనుంచి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కూడా లేవు. వచ్చిన భక్తులకోసం మరుగుదొడ్ల సౌకర్యం లేదు. ఇక్కడ నెలకొన్న సమస్యలపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పర్యాటక ప్రాంతమైన వేమన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



ముళ్లకంపలతో నిండిన పార్కు



వేమన జీవసమాధి

టెంపుల్ సర్క్యూట్ చేస్తే పర్యాటకుల సందడి

కదిరి ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం. గిన్నీస్ బుక్ రికార్డులో ఉన్న తిమ్మమ్మ మర్రిమాను, తెలుగువారి ప్రసిద్ధ కవి యోగివేమన, బత్రేపల్లి జలపాతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని విద్యాశాఖమంత్రి నారాలోకేష్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తే పలు ప్రాంతాలనుంచి వచ్చే సందర్శకులతో సందండి పెరుగుతుందని, చిరు వ్యాపారులకు ఉపాధి లభిస్తుందని భక్తులంటున్నారు.

వేమన జయంతికైనా అభివృద్ధికి జరిగేనా?

గత ప్రభుత్వంలో 2023లో అప్పటి పర్యాటక మంత్రి రోజా ధూమ్‌ధామ్ అంటూ హడాహుడిగా వేమన జయంతిని జరిపారు. అప్పట్లో వేమన ఆలయాన్ని నూతన హంగులతో తీర్చిదిద్దుతామని హామీఇచ్చారు. అయితే ఈ ఏడాది జయంతి వేడుకలు కూడా నిర్వహించకపోవడం దురదృష్టకరం. 2025 జనవరిలో నిర్వహించనున్న వేమన జయంతి వేడుకలకు అభివృద్ధి పనులు పూర్తి చేస్తే సౌకర్యంగా ఉంటుందని భక్తులంటున్నారు. పార్కులోని గడ్డిని తొలగించడానికి దాతలు విరాళలు ఇస్తున్నారు. భక్తులు అసౌకర్యాల నడమ ఇబ్బందులు పడుతున్నారు. టూరిజం అధికారులు సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు నివేదికలు పంపాం

వేమన ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు నివేదికలు పంపాం. కదిరి నియోజకవర్గంలో టెంపుల్ సర్క్యూట్ చేయడానికి ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు, నిధులు వస్తే పర్యాటక కేంద్రాలను తీర్చిదిద్దుతాం.

- జయకుమారి, ఏపీ టూరిజం

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలి



ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేశ్

ధర్మవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఓటు హక్కును పొందాలని ఆర్డీఓ మహేశ్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ధర్మవరం నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌ఓలకు ఆర్డీఓ తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. మొత్తం 127 దరఖాస్తులను స్వీకరించామన్నారు. ఫారం-6కు 60, ఫారం-7కు 22, ఫారం-8కు 445 దరఖాస్తులు వచ్చాయని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సురేశ్‌బాబు, ఈడీటీ అశ్వరయ్య పాల్గొన్నారు.

'వదాన్య' ప్రతిభా పరీక్ష పోస్టర్ విడుదల



మాట్లాడుతున్న అశోక్ పడపాటి

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల డ్రాప్‌ఔట్ల తగ్గింపు, ప్రైవేట్ పాఠశాలల్లో వలసల నివారణ, ప్రతిభ వెలికితీతే ప్రధాన లక్ష్యంగా డిసెంబరు నెలలో నిర్వహించే ప్రతిభ పరీక్ష, డిసెంబరు 29న కొత్తచెరువులో నిర్వహించే డీఎస్సీ ఎస్జీటీ గ్రాండ్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టరును వెబ్‌సైట్ని వదాన్య ఫౌండర్, వదాన్య బృందం ఆవిష్కరించారు. ఈ మేరకు శనివారం ఆ సొసైటీ కార్యాలయంలో ఫౌండర్ అశోక్ పడపాటి వివరాలు వెల్లడించారు. పరీక్ష నిర్వహణ కోసం సంబంధించిన సమాచారం తెలియజేయడానికి గ్రామీణ ప్రాం తాల్లోని నిరుపేదలకు కొత్తచెరువు ప్రధాన పరీక్షా కేంద్రంగా పరీక్ష నిర్వహి స్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపా యం అందించే ఈ పరీక్షను డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థులందరూ వినియోగించు కోవాలన్నారు. పరీక్షకు సంబంధించిన వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. కేవలం రెండు వేల మందికి మాత్రమే ఈ పరీక్షలో పాల్గొనడానికి ఉందన్నారు. హాల్ టికెట్లను నమోదు చేసుకున్న వివరాల ప్రకారం వారి వారి వాట్సాప్‌లకు లేదా ఈమెయిల్‌కు పూర్తీ వివరాలను తెలుసుకోవడం వదాన్య సొసైటీని ఫాలో కావాలన్నారు.

పెంపుడు కుక్క కరిచి బాలుడికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

ధర్మవరంరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరావుపేట గ్రామంలో బాబావలి కుమారుడు ఖలీద్ బాషా అనే బాలుడికి అదేగ్రామంలో ఓ పెంపుడు కుక్క కరిచి తీవ్రంగా గాయపరిచిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు ఖలీద్‌బాషా అనే బాలుడు ఇంటివద్దకు వెళుతున్న సమయంలో అదేగ్రామంలో ఓ వ్యక్తి పెంపుడు కుక్కతో వెళుతుండగా ఆ కుక్క ఖలీద్‌బాషా తొడను కరిచింది. గాయపడిన బాలుడిని హుటాహుటిన ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

వేంకటేశ్వరుడి అలంకరణలో త్రిలింగేశ్వరుడు



అలంకరణలో స్వామివారు

ధర్మవరంరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బసవన్న కట్ట వీధిలో వెలసిన పురాతన త్రిలింగేశ్వరుడు ఆలయంలో శనివారం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకుడు రాఘవశర్మ స్వామివారి లింగానికి వేంకటేశ్వరుడి గోవిందనామాలతో అలంకరించారు. ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి ఆలయం ముందు భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందించారు.

12 నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బత్తలపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా 12వ తేదీ నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. 12న గరిశెనపల్లి, 13న దంపెట్ల, 14న ఓబుళాపురం, 15న సంగాల, 19న అప్రాచెరువు, చెన్నరాయపట్నం, 20నబత్తలపల్లి, 21న రాఘవంపల్లి, ముష్టూరు, 22న మాల్యవంతం, 26న డి.చెర్లోపల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

సింగేపల్లిలో వైసీపీకి షాక్

గుడిబండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగేపల్లి గ్రామంలో వైసీపీకి షాక్ తగిలింది. శనివారం వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు సుమారు 30కుటుంబాలవారు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందన్నారు. బెంగుళూర్‌కు చెందిన శంకర కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొని కంటి చూపు మందగించిన వారికి చికిత్సలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

బత్తలపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ముష్టూరు క్రాస్ వద్ద 3వ తేదీన మూడు చక్రల వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మద్దిలేటి మూడుచక్రాల బైక్‌పై వస్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మద్దిలేటి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పశువుల పాకగా పంచాయతీ కార్యాలయం

నంబులపూలకుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం పశువుల పాకగా మారింది. పలువురు మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో పంచాయతీ కార్యాలయ నిర్మాణం చేపట్టగా, అసంపూర్తిగా నిలిచిపోయింది. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కార్యాలయాన్ని పూర్తి చేయలేదు. దీంతో గ్రామానికి చెందిన కొంతమంది పశువులు, గొర్రెల మందలకు ఆవాసంగా చేసుకున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఈవిషయాన్ని పలుమార్లు అధికారులు తెలిపినా పట్టించుకోలేదని మండిపడ్డారు. అలాగే నంబులపూలకుంట, వంకమద్ది పంచాయతీ కార్యాలయాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న పంచాయతీ కార్యాలయాలను పూర్తిచేసి, వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణ దశలోనే ఉన్న పంచాయతీ కార్యాలయం

వలస కూలీలకు వరం!

● జీవనోపాధి కల్పిస్తున్న ఇటుక బట్టీలు
● నెలకు రూ.50వేల వరకూ సంపాదించుకునే అవకాశం
● కూలీరేట్లపై ఒడిశా కుటుంబాల హర్షం



పరిగి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా 70నుంచి 80దాకా ఇటుక బట్టీలుంటే ప్రతి చోట ఒరిస్సా రాష్ట్ర వాసులే కనబడతారు. తెలుగు భాషరాని ఈ 200మంది పరిగి మండల వ్యాప్తంగా ఉన్న ఇటుక బట్టీల్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వలసరావడం వెనకల కారణాల గురించి వారిని పలకరిస్తే తమకు ఇక్కడే సౌకర్యంగా ఉందంటున్నారు. తమ రాష్ట్రంలో చాలీచాలని రోజు కూలీగా పనిచేస్తూ కుటుంబ పోషణ, కష్టంగా మారడంతో స్నేహితుల సమాచారంతో పరిగి మండలానికి వలస వచ్చామంటున్నారు. ఇక్కడ రోజూ కూలీ పనిచేస్తూ ఒరిస్సా రాష్ట్రంలోని తమ కుటుంబంలో పిల్లల చదువులకు, తల్లిదండ్రుల ఆరోగ్య ఖర్చులకు సహాయం చేయగలుగుతున్నామంటున్నారు. ఒరిస్సాలో రోజు కూలి రూ.150 నుంచి రూ.200దాకా వస్తుండగా, ఇక్కడ ఇటుక బట్టీల్లో భార్యభర్త కలిసి ఒక్కరోజు పనిచేస్తే రూ.2వేల నుంచి రూ.3వేల దాకా వస్తుందంటున్నారు. ఇంటి అద్దెలు లేకుండా యజమానులే బట్టీ వద్ద వసతి, నీటి సౌకర్యం కల్పిస్తున్నారని హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఇటుక బట్టీ యజమానులు మాట్లాడుతూ ఒరిస్సావాసులు ఇటుక తయారీచేసే విధానం, బట్టీని పరిశుభ్రంగా చూసుకునే విధానం బాగుంటాయంటున్నారు. మరి వారి చిన్నారుల చదువు విషయమై మండల విద్యాధికారి లక్ష్మీదేవిని ప్రశ్నించగా, ఉపాధికోసం వచ్చినవారి పిల్లలకు స్థానిక పాఠశాలలో చదువుకునేందుకు అవకాశం కల్పిస్తామంటున్నారు.

ఐదారు నెలలకోసారి ఊరికెళతాం



ఇక్కడ పనిచేయడంవలన మా పిల్లల చదువుకు తల్లిదండ్రుల వైద్య ఖర్చులకు ఇబ్బందులు లేకుండా జరుగుతోంది. ఐదారు నెలలకోసారి అంటే హోళి, దసరా, దీపావళి పండగలకు ఊరికి వెళ్లొస్తాం.

లింగన్న, ఒరిస్సావాసి

రోజుకు రూ.2వేల దాకా వస్తోంది



ఇక్కడ పనులు చేసుకుంటూ మేమిద్దరం కలిసి రోజుకు రూ.2వేల దాకా సంపాదిస్తూ మా రాష్ట్రంలో ఇంటికి పంపుతున్నాం. ఇటుక బట్టీ యజమానులు ఇక్కడ మాకు వసతులు కల్పిస్తున్నారు.

రాజేష్, ఒరిస్సా

పోలింగ్ కేంద్రం పరిశీలన



వన్నంపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

పరిగి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆర్డీఓ ఆనంద్ కుమార్ పరిశీలించారు. వన్నంపల్లిలోని పాఠశాలలో ఓటర్ల నమోదు నిర్వహిస్తుండగా శనివారం ఆర్డీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన యువత తమ ఓట్లను నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యకర శిశువులు

పెనుకొండ రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : గర్భవతులు పోషకాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యకరమైన శిశువు జన్మిస్తుందని వైద్యాధికారి నాగరాజునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం గుట్టూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భవతులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కేంద్రానికి వచ్చిన 87మంది గర్భవతులు, బాలింతలకు బీపీ, రక్త పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. కేంద్రానికి వచ్చిన గర్భవతులకు ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నదానం నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికీ న్యాయం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి

పెనుకొండ రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవానికి న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవన్, అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ పేర్కొన్నారు. పెనుకొండ మండలం వెంకటరెడ్డిపల్లి గ్రామంలో శనివారం జాతీయ న్యాయ సేవా దినోత్సవంలో భాగంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రవేశపెట్టిన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, న్యాయవాది నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ

పెనుకొండ రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆదివారం కదిరిలో ఆవిష్కరించనున్నట్లు వడ్డెర్ల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలో వడ్డెర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణలో వడ్డెర కులస్థులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు వీజీపాళ్యం శీన, ప్రధాన కార్యదర్శి నాగప్ప, పల్లవరాజు, వడ్డె యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ప్రత్యేక ఓటరు నమోదు

లేపాక్షి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల ఆదేశాల మేరకు మండలంలో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌రెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా 40 కేంద్రాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఇందులో కొత్త ఓట్ల కోసం 14, తొలగింపులకు 8, సవరణలకు 4 మొత్తం 26దరఖాస్తులు అందాయన్నారు. ఆదివారం సైతం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న కూటమి నాయకులు

పరిగి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహ ఏర్పాటుకు టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో స్థల ఏర్పాటుకై కూటమి నాయకులతో కలిసి స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహప్ప, లక్ష్మణ్‌రావు, ఆనంద్, గంటా శ్రీనివాసులు, బాలాజీ, నరసింహప్ప తదితరులుపాల్గొన్నారు.

ఉన్నత చదువుకు గౌడ సంఘం విరాళం



సాయం అందిస్తున్న ఈడిగ గౌడ సంఘం నాయకులు

గోరంట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థి హేమంత్‌కుమార్ గౌడ్ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండగా జిల్లా ఈడిగ గౌడ ఉద్యోగుల సంఘం రూ.50 వేల విరాళాన్ని శనివారం కుటుంబ సభ్యులకు అందించింది. పుట్టపర్తి మండలం కర్నాటక నాగేపల్లికి చెందిన ఈడిగ ఎర్రిస్వామి, విజయలక్ష్మీల కుమారుడు హేమంత్‌కుమార్ పుత్తూరు ఇంజనీరింగ్ కళాశాలలో 4వ సవంవత్సరం చదువుతున్నాడు. ఈ ఏడాది ఈడిగ గౌడ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ టీచర్ నాగేంద్ర ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు, వారి మిత్ర బృందం రూ.50 వేల మొత్తాన్ని విద్యార్థి తల్లికి అందించారు. నాగేంద్రతోపాటు, వేణుగోణుగోపాల్, సాయి ప్రశాంత్, మహేష్, రమేష్, వెంకటేష్, సునీల్ ప్రవీన్ తదితరులు పాలుపంచుకున్నారు.

ప్రభుత్వ స్థలంలో గుడిసెల తొలగింపు

● ముందస్తు చర్యల్లో భాగంగా కమ్యూనిస్టు నాయకుల అరెస్ట్

హిందూపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొల్లకుంట వద్ద ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసుకున్న గుడిసెలను శనివారం తొలగించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య గుడిసెలను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో హిందూపురంతోపాటు సోమందేపల్లి, పెనుకొండ, గోరంట్ల, పరిగి మండలాలకు చెందిన కొంతమంది గుడిసెలు వేసుకున్నారన్నారు. వీరంతా కొంతమంది మధ్యవర్తులను నమ్మి రూ.5వేల నుంచి రూ.10వేల దాకా డబ్బులిచ్చి గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. హిందూపురం మండలంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గుడిసెలు వేసినా కట్టడాలు కట్టినా తొలగిస్తామన్నారు. అయితే ఇక్కడ ప్రభుత్వ భూమిలో కట్టడాలు కట్టి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నా అటు మునిసిపాలిటీ, ఇటు విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటి వరకు గుర్తించకపోవడం బాధాకరమని పోలీసులు, రెవెన్యూ అధికారులు అన్నారు.

సీపీఐ, సీపీఎం నాయకులు అరెస్ట్

లేపాక్షి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హిందూపురం నియోజకవర్గం కొల్లకుంట వద్ద నిరుపేదలు వేసుకున్న గుడిసెలను రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సిబ్బంది తొలగించేశారు. ఇందులో భాగంగా గొడవలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లోని సీపీఐ, సీపీఎం నాయకులను శనివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. హిందూపురం వన్‌టౌన్ ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో నాయకులను లేపాక్షి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శనివారం సాయంత్రం వరకు వారిని స్టేషన్‌లో ఉంచారు. అనంతరం సాయంత్రం వారిని వదిలేశారు. ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తు చర్యగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రభుత్వ స్థలంలో వేసిన గుడిసెలను తొలగిస్తున్న దృశ్యం

క్రీడల వల్ల దేహదారుఢ్యం



ఖోఖో ఆడుతున్న బాలికలు

హిందూపురం అర్బన్, నవంబరు 9: ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని, క్రీడల వల్ల మనో వికాసమే కాకుండా దేహదారుఢ్యం వస్తుందని డా. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పెద్ద గుడ్డంపల్లిలోని ఉషోదయ పాఠశాలలో రెండు రోజులుగా జరుగున్న ఆటల పోటీలు శనివారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. ఆటలు ఆడే వారికి మెదడు చురుగ్గా ఉంటుందన్నారు. అదే చురుకు చదువులో కూడా ఉంటుందన్నారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరిస్తారని వారికి మనో నిబ్బరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం రవీంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ శివరాయ్, ఏఓ అరుణకుమారి, లక్ష్మీ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ఘనంగా బొమ్మ లింగేశ్వరస్వామి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఏడుగురు అక్కమ్మ గార్లు

అగళి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మడకశిర నియోజకవర్గం అగళి మండలం డొక్కలపల్లి గ్రామం సమీపంలో వెలసిన ఏడుగురు అక్కమ్మగార్ల ఆలయంలో, దేవరపల్లి గ్రామంలో బీరలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడురోజులపాటు ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ప్రాణహాని.. ప్లాస్టిక్ వాడకం

● విచ్చల విడిగా ప్లాస్టిక్ సంచుల వినియోగం
● పట్టించుకోని అధికారులు ● అడపాదడపా దాడులతో సరి



హిందూపురం అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో ప్లాస్టిక్ ఒక భాగమైపోయింది. అవి లేనిదే మనుషులు బ్రతుకలేరేమో అనేంతగా ప్లాస్టిక్ వాడుతున్నారు. నిత్యావసర సరుకులకే కాదు, పాలు పెరుగు, కాఫీ గ్లాసులు, పేట్లు, గ్లాసులు, కవర్లు తదితరాలను యథేచ్ఛగా వాడుతున్నారు. ఇంతకు ముందు మన పూర్వీకులు బట్టలతో నేసిన బ్యాగులను వాడేవారు. అంగళ్ళలో కాగితపు కవర్లు వాడే వారు. నూనె నెయ్యి తదితరాలకు గాజు, పింగాణి పాత్రలు వాడేవారు. పాలు పెరుగు కోసం వెండి, సిల్వర్, స్టీలు పాత్రలు. వాడేవారు. కానీ ప్రస్తుతం అన్ని వస్తువులకు ప్లాస్టిక్ కవర్ల వాడకం నిత్యకృత్యంగా మారింది. వంద లోపు మైక్రాన్‌ల మందం కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ సంచులను వాడకంలోకి తీసుకురాకూడదని నిబంధనలు ఉన్నా వాటిని ఎవరూ పట్టించుకోవడంలేదు. తక్కువ మైక్రాన్‌ల ప్లాస్టిక్ భూమిలో వందల సంవత్సరాలు అయినా కలువదు. కాల్చినా అది అంత సులభంగా భూమిలో కలిసిపోదు, పైగా వాటివల్ల కాలుష్యం ఎక్కువగా ఉంటుంది.

- ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్

ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్ లాంటి రోగాలు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. అన్నీ తెలిసినా ప్లాస్టిక్ తయారీ మాత్రం ఆగడంలేదు, ప్రజలకు, పశుపక్షాదులకు ముప్పు అని తెలిసికూడా ప్లాస్టిక్ సంచులు తయారు చేసే కొంత మంది స్వార్థపరులు దేశాన్ని నాశనం చేస్తున్నారు. పశువులు ప్లాస్టిక్ కవర్లు తిని రోగాల బారిన పడటమే కాకుండా ప్రాణాలు కూడా పోగొట్టుకుంటున్నాయి. ఈ విషయాలు తెలిసినా సంబంధిత అధికారులు ప్లాస్టిక్ సంచుల తయారీని ఆపడంలేదు. అసలు తయారీనే లేకపోతే వాడకం ఎలాగుంటుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వాతావరణం కాలుష్యం: ప్లాస్టిక్ వాడకంతో వాతావరణం పూర్తిగా కాలుష్యంగా మారింది. వాటిని కాల్చితే ఆ పొగకు జనం రోగాల బారిన పడుతున్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, సంచులు కాలువల్లో వేయడంతో అవి నిండిపోయి మురుగు ముందుకు కదలలేక వర్షం వచ్చినపుడు రోడ్లపైకి చేరుతోంది. దీంతో పరిసరాలు దుర్గంధ భరితమవుతున్నాయి.

- ప్లాస్టిక్ తయారు చేస్తే అడ్రస్ ఉండాలి

ప్లాస్టిక్ తయారు చేస్తే వాటిపైన తయారు చేసిన కంపెనీ పేరు అడ్రస్, ఫోన్‌నెంబర్, ఎంత మందంలో తయారు చేశారు, ఎప్పుడు తయారు చేశారు, ఎక్స్‌పైరీ తేదీ తదితర విషయాలను ముద్రించాలని నిబంధనలు చెబుతున్నాయి. అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా తయారు చే సే వారికి కఠిన శిక్షలు విధించాల్సి ఉంటుంది. ఈ విషయాలన్నీ తెలిసినా సంబంధిత అధికారులు అడపా దడపా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ముడుపులు పుచ్చుకొని ముందస్తు సమాచారం ఇస్తూ వ్యాపారులకు అండగా ఉంటున్నారు. సామాజిక కార్యకర్తలు దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వార్డన్ అవినీతిపై ఉన్నతాధికారులకు నివేదిక



విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఏబీసీడబ్ల్యుఓ

గుడిబండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మందలపల్లి బీసీ హాస్టల్ వార్డన్ అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులకు నివేదిస్తానని పెనుకొండ ఏబీసీడబ్ల్యుఓ గంగాధర్ తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో హాస్టల్‌లో మాయ, హాజరుపట్టికలో 125మంది హాజరు, ఉండేది 25మందే అన్న కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఏబీసీడబ్ల్యుఓ గంగాధర్ శుక్రవారం రాత్రి హాస్టల్‌ను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ హాస్టల్‌ను పరిశీలించగా 123మందికిగాను 45మంది విద్యార్థులు హాజరైనట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. వార్డన్ కేశవప్పపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ఏడీజే

హిందూపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానం పెరిగే కొద్ది సైబర్ నేరాలు పెరుగుతున్నాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పిలుపునిచ్చారు. శనివారం జాతీయ న్యాయ సేవా దినోత్సవంను పురస్కరించుకుని అదనపు కోర్టు ఆవరణంలో కేక్‌కట్‌చేశారు. అదేవిధంగా పాలిటెక్నికల్ కళాశాలలో జాతీయ న్యాయసేవ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ చదువుకోని వారితో పాటు విద్యావంతుల సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోతున్నారన్నారు. దీనిపై అవగాహన ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను తెలుసుకోవాలని వాటిని గౌరవించాలన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులతోపాటు బాధ్యతలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, నవేరా, కళావతి, పాలిటెక్నికల్‌కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సింగేపల్లిలో వైసీపీకి షాక్

గుడిబండ,నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగేపల్లి గ్రామంలో వైసీపీకి షాక్ తగిలింది. శనివారం వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు సుమారు 30కుటుంబాలవారు వైసీపీని వీడి తెలుగు దేశం పార్టీలో చేరారు. వారిని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. టీడీపీ పార్టీని బలోపేతం చేయడానికి కృషిచేయాలన్నారు.

ఘనంగా పాలపండగ

మండలంలోని సింగేపల్లి గ్రామస్థుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా పాలపండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలపండగ కార్యక్రమాల్లో భాగంగా స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెనుకొండ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ సమీపంలో జాతీయరహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుకొండకు చెందిన కొమ్ము విజయ్‌కుమార్(35) మృతిచెందగా నందికేశవరెడ్డికి గాయాలయ్యాయి. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఎగువగడ్డ కాలనీకి చెందిన విజయ్‌కుమార్ కంప్యూటర్లు మరమ్మతులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ నేపథ్యంలో శనివారం విజయ్‌కుమార్, స్నేహితుడు నందికేశవరెడ్డిలు కలిసి ద్విచక్రవాహనంలో సోమందేపల్లి వెళ్లి తిరిగి పెనుకొండకు వస్తుండగా ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. నందికేశవరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య భువనేశ్వరి, కుమారుడు ఉన్నారు. విజయ్ మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులు రోదించిన తీరు అందరినీ కలిచివేసింది.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు. ఇన్‌సెట్‌లో విజయ్‌కుమార్ (ఫైల్)